



రేషన్ బియ్యం నిల్వలు (పాత చిత్రం)

పేదల బియ్యం.. తమ్ముళ్లు తినేస్తున్నారు..

ఐదేళ్లు వైసీపీ నేతల కనుసన్నల్లో రేషన్ బియ్యం దందా సాగింది. అధికారం మారింది.. బియ్యం వ్యాపారులు మారారు. అంతే అక్రమాలు మాత్రం అప్పటిలాగానే కొనసాగుతుండటం గమనార్హం. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు బియ్యం చీకటి వ్యాపారం నిర్వహించడం కొన్ని ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. అధికార పార్టీ నేతలు కొందరు బియ్యం అక్రమ వ్యాపారాన్ని వారి అదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. వైసీపీ పాలనలో పెద్ద ఎత్తున బియ్యం బ్లాక్ మార్కెట్ జరిగింది. అప్పట్లో బియ్యం అక్రమ నిల్వలను ప్రతిపక్ష నేతలు పట్టించారు. బియ్యం అక్రమ వ్యాపారంపై పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. అధికారం మారగానే బియ్యం అక్రమ వ్యాపారం నిరోధిస్తారని ప్రజలు భావించారు. అప్పటి లాగానే బియ్యం నల్లబజారుకు తరలిపోతున్నా నాడు ప్రతిపక్షంలో విమర్శలు చేసిన నేతలు నోరు మెదపకపోవడంతో ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. మాటలే చేతల్లో ఉండదని నేతలను ప్రజలు విమర్శిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

- అక్రమార్కులకు అధికారం అండ
- అక్కడ నెలకు రూ. 28 లక్షలివ్వాలంట
- అధికారుల తీరుపైనా విమర్శలు
- సమాచారం ఇచ్చినా స్పందించని వైనం
- ఉమ్మడి జిల్లా బియ్యం డాన్ ప్రసాద్
- టోకుగా కేజీ రూ. 28కి కొనుగోలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పౌరసరఫరాల శాఖ మంత్రి ఇలాకాలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రతి నెలా వేలాది క్వింటాళ్ల రేషన్ బియ్యం నల్ల బజారుకు తరలిపోతోంది. రేషన్ సరఫరా చేసే ఎంయూడీ వాహనం వద్దే బహిరంగంగా కొనుగోలు చేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని ఒక పట్టు పాలిష్ వేసి, గోతాలు మార్చి జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. నెలకు రూ కోట్లల్లో ముడుపులు చేతులు మారుతున్నాయి. అధికార పార్టీ నేతల అండదండలతోనే బియ్యం అక్రమ వ్యాపారం విరాజిల్లుతోంది. కార్డు దారులకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం నిల్వల్లో సగం వరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నట్టు అంచనా. ఇదంతా బహిరంగానే జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోరు. కొందరు అధికారులకు.. కొందరు అధికార పార్టీ నేతలకు నెలవారీ మాము ళ్లు ఇస్తున్నారనేది బహిరంగ రహస్యమే. రేషన్ పంపిణీపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. నెలవారీ తనిఖీలు నిర్వహించడాన్ని కూడా వారు విస్మరించారు.

గుజరాత్‌కు తరలిపోతున్న బియ్యం నిల్వలు

మండల, నియోజకవర్గ స్థాయి వ్యాపారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యం నిల్వలను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. గతంలో కాకినాడ పోర్టుకు బియ్యం నిల్వలు తరలించేవారు. ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ కాకినాడ పోర్టులో తనిఖీలు నిర్వహించి వేలాది క్వింటాళ్ల బియ్యం అక్రమ నిల్వలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో బియ్యం బ్లాక్ మార్కెట్ రూటు మారింది. జిల్లాలో సేకరించిన బియ్యం నిల్వలను ప్రస్తుతం గుజరాత్‌కు తరలిస్తున్నట్టు అక్రమార్కులు బహిరంగానే చెబుతున్నారు.

ప్రతి నెలా రూ. 22 కోట్ల వ్యాపారం

ఉమ్మడి జిల్లాలో 14,91,277 తెల్ల కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 2,04,850 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నారు. వీటిలో 40 నుంచి 50 శాతం బియ్యం నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు ఒక అంచనాగా ఉంది. అంటే దాదాపు 90 వేల నుంచి లక్షల క్వింటాళ్ల వరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నట్టు అక్రమార్కుల చెబుతున్న లెక్కలు తెలియజేస్తున్నాయి. పల్నాడు జిల్లాలోని ఒక నియోజకవర్గానికి నెలకు 13,971 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతోంది. అయితే ఒక ముఠా 250 టన్నులు, మరో ముఠా సుమారు 150 టన్నులు బియ్యం డీలర్ల నుంచి సేకరించి బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్టు ప్రచారం. ప్రభుత్వం కార్డు దారులకు సరఫరా చేసిన నిల్వల్లో దాదాపు 40 శాతం బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్టు తెలిసింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 8 వేల టన్నుల వరకు బియ్యం నిల్వలు జిల్లా సరిహద్దు దాటిపోతున్నాయనేది ఒక అంచనాగా ఉంది. టోకు వ్యాపారి కిలో రూ. 28 బియ్యం కొనుగోలు చేస్తుండగా దీని ప్రకారం దాదాపు ప్రతి నెలా రూ 22 కోట్లకు బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతున్నట్టు అంచనా.



నరసరావుపేటలోని వినుకొండ రోడ్డులో బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా పోలీసులకు పట్టించిన బియ్యం ఉన్న వాహనం

బ్లాక్ మార్కెట్ కట్టడి చేసేనా?

ఉమ్మడి జిల్లాలో వైసీపీ హయాంలో పెద్దఎత్తున బియ్యం బ్లాక్ జరిగింది. అదే వరవడిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అక్రమార్కులు కొనసాగిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం పేదల బియ్యం బ్లాక్ మార్కెట్‌ను పూర్తిగా నిరోధిస్తుందని ప్రజలు భావించారు. రెండు నెలలు గడిచినా బియ్యం బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాకు చెందిన నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నారు. ఆయన కాకినాడ పోర్టులో తనిఖీలు నిర్వహించి వేలాది టన్నుల బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఇదే తరహాలో ఉమ్మడి జిల్లాలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నరసరావుపేటలో 50 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

నరసరావుపేట లో 50 బస్తాల రేషన్ బియ్యం నిల్వలను రూరల్ పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం ఇక్కడి వ్యాపారులకు కాకుండా ప్రకాశం జిల్లాకు తరలిస్తున్నారన్న సమాచారంతో ఇక్కడి కొందరు ఓపార్టీ కార్యకర్తలు వినుకొండ రోడ్డులో రాత్రి 10 గంటల సమయంలో కాపుకాసి బియ్యం తరలిస్తున్న ఆటోను అడ్డుకున్నారు. ఈ మేరకు సదరు వ్యక్తులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ పోలీసులు బియ్యం నిల్వ ఉన్న ఆటోను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులపై అధికార పార్టీ ఒత్తిళ్లు

బియ్యం అక్రమ వ్యాపారం, బియ్యం రీసైక్లింగ్ జరిగే మిల్లులు వీటి చిరునామాలతో సహా సమాచారం ఉన్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడరు. కొందరు అధికారులు అక్రమార్కులకు సహకరిస్తున్నా కొందరు అధికారులు బియ్యం బ్లాక్ మార్కెట్‌పై స్పందించి తనిఖీలు నిర్వహించినా చర్యలు తీసుకొనే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు. వీరిపై అధికార పార్టీ ఒత్తిడి ఉండటం జగమెరిగిన సత్యమే. బ్లాక్ మార్కెట్ చేస్తోంది అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కావడంతో చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మిన్నకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల పల్నాడు జిల్లాలోని ఒక నియోజకవర్గంలో రెండు ముఠాలుగా నేతలు విడిపోయి బియ్యం వ్యాపారం నిర్వహించారు. ఒక ముఠాకు సంబంధించి బియ్యం నిల్వ చేసిన మిల్లుపై మరో ముఠా విజిలెన్స్ అధికారుల చేత దాడులు చేయించింది. అయినా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తనిఖీలకు వచ్చిన అధికారులు మిల్లులో బియ్యం నిల్వలు లేవని వెల్లడించడం గమనార్హం.

పల్నాడులో రెండు ముఠాలు..

పల్నాడు జిల్లాలోని ఒక నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి బియ్యం డీలర్ల నుంచి కొనుగోలు చేశారు. ఒక ముఠా కిలో రూ 13, మరో ముఠా కిలో రూ 15 నుంచి 16కు కొనుగోలు చేశారని నియోజకవర్గం మొత్తం కోడైకూసింది. ఇక్కడ ఒక ముఠాలో దాదాపు 10 మంది సభ్యులు ఉండగా ఒక్కొక్క వ్యక్తి రూ 5 నుంచి 7 లక్షలు పెట్టుబడి వ్యయంగా ఒక నేత వద్ద ఉంచినట్టు తెలిసింది.

బియ్యం బ్లాక్ మార్కెట్ ఇలా..

కార్డు దారుల నుంచి డీలర్లు కిలో రూ 8 నుంచి రూ 10 వరకు కొనుగోలు చేస్తున్నారు. వీరి వద్ద నుంచి మండల, నియోజకవర్గ స్థాయి అక్రమార్కులు డీలర్ల వద్ద కిలో రూ 13 నుంచి రూ 16 వరకు కొనుగోలు చేస్తేన్నారు. మండలాల వారీగా స్టాక్ పాయింట్‌లు ఏర్పాటు చేసుకొని రాత్రి వేళ్లలో అక్రమార్కులు ఆటోలు వంటి చిన్న వాహనాల్లో డీలర్లు నుంచి బియ్యం సేకరిస్తున్నారు. ఇలా నిల్వలను స్టాక్ పాయింట్‌కు తరలిస్తున్నారు. కొన్ని చోట్ల మిల్లులను లీజుకు తీసుకొని సేకరించిన బియ్యంకు ఒక పట్టు పాలిష్ వేసి గోతాలు మారుస్తున్నారు. 25, 50 కేజీల ప్యాకింగ్ చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయి వ్యాపారుల నుంచి టోకు వ్యాపారి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. టోకు వ్యాపారి కిలో బియ్యం రూ 28 కొనుగోలు చేస్తున్నాడు. డీలర్ నుంచి టోకు వ్యాపారి వరకు బియ్యం నెలవారీగా కొనుగోళ్ల జరుగుతున్నాయి. అక్రమార్కులు పోటీ పడ్డ చోట డీలర్లకు రేటు ఎక్కువగా లభిస్తున్నట్టు తెలిసింది.

బియ్యం డాన్.. గుంటూరు ప్రసాద్ ?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టోకుగా బియ్యం కొనే వ్యక్తి గుంటూరుకు చెందిన ప్రసాద్‌గా తెలుస్తోంది. ఇతనికి అక్రమార్కులు బియ్యం డాన్... గుంటూరు ప్రసాద్‌గా పిలుచుకుంటారు. ఈ వ్యక్తి నియోజకవర్గాల వారీగా అక్రమార్కుల వద్ద నుంచి బియ్యం కిలోకు రూ. 28 చెల్లించి కొనుగోలు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఇతని కింద చాలా నియోజకవర్గాలు ఉన్నట్టు తెలిసింది. సత్తెనపల్లి మండలం కొమెరపూడి, పేరేచర్లలో సదరు వ్యాపారి స్టాక్ పాయింట్‌లు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా సేకరించిన బియ్యం నిల్వలను ఆయా స్టాక్ పాయింట్‌ల నుంచి గుజరాత్‌కు తరలిస్తున్నట్టు ప్రచారం. వైసీపీ పాలనలోనూ ఈ ప్రసాద్ ఐదేళ్ల బ్లాక్ మార్కెట్ నిర్వహించాడని, అతనే ఇప్పుడు కూడా కొనసాగుతున్నట్టు చెబుతున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా బియ్యం బ్లాక్ మార్కెట్ చేసిన వ్యాపారులనే కొందరు నేతలు కొనసాగిస్తుండటాన్ని అధికార పార్టీలో కొందరు నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. మండలాలు.. నియోజకవర్గాల వారీగా బియ్యం బ్లాక్ మార్కెట్ చేసుకొనే అవకాశాన్ని కొందరు వ్యాపారులకు నాయకులు కట్టబెట్టినట్టు టీడీపీ వర్గాలే ప్రచారం చేస్తున్నాయి.

అక్కడ నెలకు రూ. 28 లక్షలు

బియ్యం అక్రమ వ్యాపారంలో ఉమ్మడి జిల్లాలో కొన్ని నియోజకవర్గాలు మినహా చాలా చోట్ల అధికార పార్టీ నేతలు అక్రమార్కుల నుంచి ముడుపులు తీసుకుంటున్నట్టు పార్టీ వర్గాలే ప్రచారం చేస్తున్నాయి. ఒక చోట బియ్యం అక్రమ వ్యాపారం నిర్వహణకు నెలకు రూ. 28 లక్షలు చెల్లిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరికొన్ని చోట్ల నెలకు రూ..20 లక్షల వరకు చేతులు మారుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. కొన్ని శాఖల అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్టు తెలిసింది. ఒక శాఖలోని కొందరు అధికారులకు ఒక్కొక్క చోట నెలకు రూ 2.50 లక్షల నుంచి రూ 4 లక్షల వరకు మామూళ్ల చెల్లిస్తున్నట్టు తెలుస్తోంది. మరో శాఖకు సంబంధించి ఒక్కొక్క చోట నెలకు రూ 50 వేల వరకు మామూళ్ల ఇస్తున్నారని ప్రచారం. దీంతో అక్రమార్కులు నిర్వహించే బియ్యం బ్లాక్ మార్కెట్ నిరాటంకంగా సాగుతుందని చెబుతున్నారు.



పోలీసు శాఖలో.. బదిలీల కలకలం

- ఐదేళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని వేరే సబ్ డివిజన్‌కు బదిలీ
- గుంటూరు నగరం ఒక యూనిట్‌గా పరిగణన
- నగరంలో పనిచేసిన వారు బయటకు వెళ్లాల్సిందే
- స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది తొలగింపు దిశగా కసరత్తు

గుంటూరు, ఆగస్టు 25 : పోలీస్ వ్యవస్థ ప్రక్షాళనకు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ శ్రీకారం చుట్టారు. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో పాతుకుపోయి వివిధ వర్గాలతో సంబంధాలు పెంపొందించుకొని తద్వారా అవినీతికి పాల్పడు తున్నారనే ఆరోపణలతో పాటు సంవత్సరాలు తరబడి గుంటూరు నగరంలో పాతుకుపోయి అక్కడక్కడే స్టేషన్‌లు మారుతూ ఉద్యోగం చేస్తున్న వారు కొందరైతే, అనేకమంది అటు మంగళగిరి, తుళ్లూరు, పొన్నూరు. తెనాలి రూరల్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారనే కారణం, అదేవిధంగా అందరూ గుంటూరు నగరంలోనే విధులు నిర్వహించాలనే ఆలోచన చేస్తుండటంతో మంగళగిరి, తుళ్లూరు తదితర పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వంటి అనేక కారణాల రీత్యా పోలీస్ సిబ్బంది బదిలీలకు ఎస్పీ శ్రీకారం చుట్టారు. గుంటూరులోని ఈస్ట్, వెస్ట్ సబ్ డివిజన్లను ఒక యూనిట్‌గా పరిగణించారు. మంగళగిరి పరిధిలోని నార్త్, తుళ్లూరు సబ్ డివిజన్లను ఒక యూనిట్‌గా, తెనాలి సబ్ డివిజన్‌ను మరో యూనిట్‌గా పరిగణించి ఐదేళ్ల ఒక యూనిట్ పరిధిలో విధులు నిర్వహించిన వారిని మిగిలిన రెండు యూనిట్లలో ఏదో ఒక పోలీస్‌స్టేషన్‌ను ఎంచుకోవాల్సిందిగా సూచిస్తూ కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా బదిలీలు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌ల బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. మంగళవారం కానిస్టేబుళ్ళకు కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు పూర్తి చేయనున్నారు. ఈ ప్రక్రియలో పారదర్శకంగా బదిలీలు పూర్తి చేయాలని ఎస్పీ కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు బదిలీల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీస్ సిబ్బంది ఎటువంటి ఒత్తిళ్ల తీసుకురావద్దని ఇప్పటికే ఎస్పీ వారికి స్పష్టం చేశారు. ముఖ్యంగా రాజధాని ప్రాంతంలోని తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. అక్కడ 54 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా మంగళగిరి పరిధిలోని నార్త్ సబ్ డివిజన్లో సుమారు 35 ఖాళీలు ఉన్నాయి. ముఖ్యంగా రాజధాని ప్రాంతంలో వివిపిల కదలికలు ఎక్కువగా ఉంటాయి. అక్కడ సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ ఎవరూ కూడా అక్కడికి వెళ్లేందుకు సుముఖంగా లేకపోవడంతో పోలీస్ శాఖ కొంతవరకు ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ సంబంధిత పోలీస్ సిబ్బంది స్థానిక రాజకీయ నాయకుల ద్వారా పోలీసులు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి తాము కోరుకున్న పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గుంటూరు నగరంలో ఈస్ట్, వెస్ట్ సబ్ డివిజన్‌ల పరిధిలో ఆరు లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్ లు ఉండగా, వీటికదనంగా రెండు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు, అదేవిధంగా కంట్రోల్ రూమ్, దిశా, సిసిఎస్ తదితర స్టేషన్‌లు ఉన్నాయి. ఎక్కువ మంది ఈస్ట్ లో దీర్ఘకాలం పని చేస్తే ఆ తర్వాత వెస్ట్ లోకి రావడం, వెస్ట్ లో ఐదేళ్ల పూర్తయితే ఈస్ట్‌లోకి వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నగర పరిధిలో పోలీసు విభాగం కొంతవరకు ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొంటున్నట్లు ఎస్పీ గ్రహించారు. ముఖ్యంగా ఏళ్ల తరబడి గుంటూరు నగరంలోనే పాతుకుపోవడంతో వారికి వివిధ వర్గాలతో సంబంధాలు ఏర్పడడం కారణంగా సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించలేని పరిస్థితి ఉందనే వాదన కూడా ఉంది. వీటన్నింటి నేపథ్యంలో జిల్లాలో పోలీస్ శాఖ ప్రక్షాళనకు సిబ్బంది నుంచే శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఏఎస్ఐ హెడ్ కానిస్టేబుల్ ప్రక్రియ పూర్తికాగా మంగళవారం కానిస్టేబుల్ ప్రక్రియ జరగాల్సి ఉంది.

స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది మార్పు పట్ల విమర్శలు

అయితే పోలీస్ శాఖకు గుండెకాయ లాంటి స్పెషల్ బ్రాంచ్ విభాగాన్ని కూడా ప్రక్షాళన చేయాలని నిర్ణయం తీసుకోవడం విమర్శలకు దారితీస్తోంది. ముఖ్యంగా స్పెషల్ బ్రాంచ్ లో పనిచేసే అధికారులు, సిబ్బందికి అనుభవం అవసరం. అవినీతి ఆరోపణలు ఉన్న సిబ్బంది ఉంటే వారిని వేరే స్టేషన్‌కు బదిలీ చేయాలి, లేదంటే స్పెషల్ బ్రాంచ్ నుంచి బయటకు పంపవచ్చు. అలా కాకుండా స్పెషల్ బ్రాంచ్ లో అనుభవం గడించి వివిధ వర్గాలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకొని పక్కా సమాచారం తెలుసుకునే విధంగా అనేకమంది స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది అందర్నీ తొలగించి కొత్తవారిని ఎంపిక చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగిన ఓ అధికారి ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. స్పెషల్ బ్రాంచ్ లో పనిచేసిన సిబ్బంది కూడా వైసీపీ ఓటమికి కారణం అని ఆ అధికారి భావించి వారిని బదిలీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

భావితరాల స్ఫూర్తి.. ఎన్టీఆర్

- శాసనసభ సభాపతి అయ్యన్నపాత్రుడు
- ఘనంగా ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ 55 వసంతాల వేడుక



ప్రసంగిస్తున్న గరికపాటి నరసింహారావు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 25: పాత, నేటి తరానికి గాకుండా భావి తరాలకు కూడా స్ఫూర్తి నిచ్చే మహనీయుడు ఎన్టీఆర్ అని ఆంధ్రప్రదేశ్ శాసన సభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గుంటూరులోని సిద్ధార్థ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ 55 వసంతాల వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు, ప్రముఖ సినీ నిర్మాత చలసాని అశ్వనీదత్, ప్రముఖ దర్శకుడు వైవీఎస్ చౌదరి తో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ యుగపురుషుడు ఎన్టీఆర్ అని అటువంటి నిజాయితీ కల్గిన వ్యక్తిని ఇంతవరకు చూడలేదన్నారు. నటుడిగా పౌరాణిక, భిన్న విభిన్న జానపద, చారిత్రాత్మక, సాంఘిక పాత్రల సూత్రధారిగా ఎన్టీఆర్ చేసిన అభినయం మరొక నటుడు చేయలేడని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆర్టీసీ బస్సుల్లో స్త్రీలకు ప్రత్యేక సీట్లు, ఆస్తిలో ఆడబిడ్డలకు సమాన హక్కు, స్థానిక సంస్థల మహిళలకు రిజర్వేషన్ల విధానాలను ప్రవేశపెట్టి మహిళా పక్షపాతిగా ఎన్టీఆర్ నిలిచిపోయారని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఇప్పుడు స్పీకర్ స్థాయికి చేరానంటే కేవలం ఎన్టీఆర్ ఇచ్చిన రాజకీయ భిక్షే కారణమన్నారు. మరో విశిష్ట అతిథి గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ ఎన్ అంటే నేషనాలిటీ, టి అంటే తెలుగు, ఆర్ అంటే రసస్ఫూర్తి అని కొనియాడారు. నేటి తరానికి ఎన్టీఆర్ సినిమాలు చూపించాలని సూచించారు. అప్పుడు కుటుంబ విలువలు తెలుస్తాయని అన్నారు. ఎన్టీఆర్ నిజాయితీ, అంకితభావం, క్రమశిక్షణ నేటి తరానికి మార్గదర్శం కావాలన్నారు. రాజకీయాల్లోకి రాకపోతే 20 ఏళ్ల క్రితమే ఎన్టీఆర్‌కి భారతరత్న పురస్కారం వచ్చేదని అభిప్రాయపడ్డారు. అశ్వనీదత్ మాట్లాడుతూ తాను నిర్మించే సినిమాల వెనుక ఎన్టీఆర్ ఆశీస్సులు ఉన్నాయన్నారు. నిర్మాత కంటే ఎన్టీఆర్ అభిమానిగా గర్వపడతానని స్పష్టం చేశారు. వైవీఎస్ చౌదరి మాట్లా డుతూ తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఎన్టీఆర్ అభిమానిగా గర్వంగా భావిస్తానని అన్నారు. ఎన్టీఆర్ కల్చరల్ అసోసి యేషన్ స్థాపించి 55 వసంతాలు పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు విశిష్ట అతిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నన్నపనేని రాజకుమారి, గోనుగుంట్ల కోటేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు జజ్జూరి మల్లికార్జునరావు, చిర్రావూరి సాంబశివరావు, దారపనేని శివప్రసాదు, కేతివల్లి సాంబశివరావు, ఎమ్ సుబ్బారావు, రావిపాటి సత్యనారాయణ , ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.





కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, గరికపాటి నరసింహారావు, హాజరైన ఎన్టీఆర్ అభిమానులు

స్థానిక సంస్థలకు అధికారాలు ఇవ్వాలి
కాంగ్రెస్ సీనియర్ నేత ఎన్.తులసి రెడ్డి
6లో..
అనధికారిక స్టాల్స్‌లో విక్రయాలు
- ఎన్టీఆర్ బస్టాండ్‌లో నిబంధనలు బేఖాతరు చేస్తోన్న వ్యాపారులు
- పట్టించుకోని యంత్రాంగం ... ఇన్‌చార్జ్‌లతో పాలన అస్తవ్యస్తం

గంజాయి ముఠా అరెస్టు

రేపల్లె, ఆగస్టు 25: ఐదుగురు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్టు పట్టణ సీఐ ఎ.మల్లికార్జున్‌రావు తెలిపారు. ఆదివారం రేపల్లె మండలంలోని బేతపూడి, పల్లెకూన వెళ్లే రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఆర్‌బీకే సచివాలయం వద్ద కొంతమంది గంజాయి విక్రయిస్తుండగా జిల్లా ఎస్పీ తుషార్‌దూడి, డీఎస్పీ మల్లికార్జున్‌రావు ఆదేశాలతో గంజాయి ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయి, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. భట్టిప్రోలు మండలం పల్లెకూన గ్రామానికి చెందిన ఆళ్ళమూడి సుదర్శన్, పులివర్తి రాధాకృష్ణ, కనపర్తి సువర్ణరాజు, పులివర్తి సుమంత్, సయ్యద్ గోపి, విచారపు నాగరాజును అరెస్టు చేసినట్లు తెలిపారు. కె.భానుప్రసాద్ పరారీలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిబాబు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

10 కేజీల గంజాయి స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఆగస్టు 25: పట్టణంలోని గుంటూరు రోడ్డులోని స్వర్గపురి వద్ద శనివారం రాత్రి సుమారు 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ గుంటూరు రోడ్డులోని స్వర్గపురి వద్ద కొందరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎపీ స్పెషల్ పోలీస్ సిబ్బంది, రెండో పట్టణ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు ఈ దాడుల్లో బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన గుంజి సుబ్బారావు, బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం కొమ్మలపాడు గ్రామానికి చెందిన సుల్తాన్ బీ, గుంటూరు జిల్లా వినుకొండ 'స చెందిన షైలపోగు వెంకటేశ్వరిలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి పది కేజీల గంజాయి, రూ. 62,000 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు.

వరవకట్టను జల్లెడ పట్టిన పోలీసులు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 25: స్వల్ప వ్యవధిలోనే పట్టణంలోని మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వరవకట్టలో రెండోసారి ఆదివారం తెల్లవారు జామున పోలీసులు జల్లెడ పట్టారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ కే. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, పదిమంది ఎస్సైలు, 100 మంది సిబ్బందితో వరవ కట్టను దిగ్బంధించి తనిఖీలు నిర్వహించారు ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 46 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు ఆధార్ కార్డు లేకుండా నివసిస్తున్న బీహార్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన 18 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఓ రౌడీ షీటర్‌ను మరో అనుమానిత షీటర్ను కూడా అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ కొమ్మనబోయిన నాగేశ్వరరావు తెలిపారు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి 7 గంటల మధ్య ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. మారణాయుధాలు, కర్రలు బాణాసంచా కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు సరైన అనుమతి పత్రాలు సమర్పించి వాహనాలను సంబంధిత యజమానులు తీసుకెళ్లవచ్చుని, లేనిపక్షంలో వాటిని న్యాయస్థానంలో ప్రవేశపెడతామ న్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న పలువురు వరవకట్ట లో షెల్టర్ తీసుకుంటున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

ఎన్టీఆర్ బస్టాండ్‌లో అనధికారిక విక్రయాలు

- నిబంధనలను ఉల్లంఘిస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు

గుంటూరు, ఆగస్టు 25: ఎన్టీఆర్ బస్టాండ్‌లో అనధికారిక విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. వ్యాపారులతో కొందరి సిబ్బంది లాలూచీ పడటంతో ఈ తతంగం సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్టాండ్‌లో పర్యవేక్షించాల్సిన అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) కె.సత్యనారాయణ మంగళగిరి డిపోకు ఇన్చార్జిగా వ్యవహ రిస్తుండటంతో ఇక్కడ పాలన మరింత గాడి తప్పిందన్న విమర్శలు వస్తున్నాయి. కొందరు వ్యాపారులు పోటీ పడి మరీ టెండర్లు దక్కించుకొని దుకాణాల్లో వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేగాక పలువురు ప్రయాణికుల నుంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ అవి బుట్టదాఖలు అవుతున్నాయి.

చిల్లర పేరుతో నిలువు దోపిడీ

బస్టాండ్‌లో ఉన్న కొన్ని దుకాణాల వారు చిల్లర పేరుతో ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇటీవల ఓ స్టాల్‌లో ప్రయాణికుడు వ్యాపారికి రూ. 500 ఇచ్చాడు. వ్యాపారి రూ.50 తీసుకోవాల్సి ఉండగా, చిల్లర లేదని రూ. 150 తీసుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు విషయం పోలీసుల దాకా వెళ్లినట్లు సమాచారం. ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయాలు జరుపుతున్నారు. ధరల పట్టికలు, ఫిర్యాదు చేయాల్సిన అధికారుల ఫోన్ నంబర్ల వంటి బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల టిక్కెట్ బుకింగ్ కౌంటర్‌లోనూ ఇలానే చిల్లర ఇచ్చే క్రమంలో వినియోగదారుడిని మోసం చేయటంతో విషయం అధికారుల వద్దకు చేరింది. మరో వైపు బస్టాండ్ ప్రాంగంణలోని మరుగుదొడ్ల నిర్వహణ కూడా అధ్వానంగా ఉంది. ప్లాట్‌ఫామ్‌లోని మరుగుదొడ్లలో మహిళల నుంచి కూడా రూ.10 వసూలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బస్టాండ్ ఆవరణలో అడ్డగోలుగా నిలిపిన వాహనాలు



బస్టాండ్‌లోని స్టాల్స్

బస్టాండ్‌లో ఎటు చూసినా వాహనాలే..

ఎన్టీఆర్ బస్టాండ్ ఆవరణలో ఎటుచూసినా అనధికార వాహనాల పార్కింగ్ కనిపిస్తుంది. వాస్తవానికి బస్టాండ్ ఆవరణ లోపల వాహనాల రాకపోకలకు నిషేధం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

పశ్చిమ డెల్టా కాల్వకు 7508 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 25: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 7508 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారు దలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండ గా, దిగువకు 18,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 330 క్యూసెక్కులనీరు, రేపల్లెకాల్వకు 1889, తూర్పుకాల్వకు 690, పశ్చిమకాల్వకు 230, నిజాంపట్నంకాల్వకు 460, కొమ్మమూరుకాల్వకు 3260 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అనువాద కొండ.. బెల్లంకొండ



సదస్సులో ప్రసంగిస్తున్న రచయిత, పాత్రికేయులు రెంటాల జయదేవ్, ప్రముఖులు.

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 25: తెలుగు అనువాద సాహిత్యంలో బెల్లంకొండ అనువాద కొండగా నయగార కవులలో ఒకరైన బెల్లంకొండ రామదాసును ప్రముఖ రచయిత, పాత్రికేయులు రెంటాల జయదేవ్ అభివర్ణించారు. ఆదివారం పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో కేంద్ర సాహిత్య అకాడమి, పల్నాడు కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో జరిగిన బెల్లంకొండ రామదాసు శత జయంతి సదస్సులో పాల్గొన్న ఆయన బెల్లంకొండ అనువాద సాహిత్యంపై పత్ర సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఆయన బెల్లంకొండ తన తండ్రి రెంటాల గోపాల కృష్ణతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఇద్దరూ కలిసి అనువదించిన రష్యన్ క్లాసిక్ యుద్ధం శాంతి నవలను విశ్లేషించారు. బెల్లంకొండ సాహిత్యంలో చేయని ప్రక్రియ లేదన్నారు. సదస్సులో స్వాగతోపన్యాసం చేసిన కేంద్ర సాహిత్య అకాడమి తెలుగు సలహా సంఘం కన్వీనర్ సి. మృణాలిని మాట్లాడుతూ బెల్లంకొండ పుట్టిన ఊరులోనే ఆయన శత జయంతి నిర్వహించడం ముదావహమన్నారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ నయగార కవిగా బెల్లంకొండ అనే అంశం గురించి మాట్లాడారు. నాటక రచయిత కందిమళ్ల సాంబశివరావు బెల్లంకొండ నాటకాలను విశ్లేషించారు. రచయిత మన్నే శ్రీనివాసరావు బెల్లంకొండ నాటికలను, జడ సుబ్బారావు బెల్లంకొండ కథలను విశ్లేషించి, పత్రాలు సమర్పించారు. రచయిత, పాత్రికేయులు సయ్యద్ నశీర్ అహ్మద్ బెల్లంకొండ కుటుంబ నేపథ్యాన్ని వివరించారు. సదస్సును తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రచయితలు సుజాత వేల్పూరి, అనిల్ బత్తుల, చేపూరి వెంకట్రావ్, కట్టా సిద్దార్ గంధం యాజ్ఞవల్క్యశర్మ, యన్నం నర్శిరెడ్డి, కేవీకే రామారావు లను నిర్వాహకులు సన్మానించారు. కళాక్షేత్రం కార్యదర్శి యస్.యం.బాషా సదస్సును నిర్వహించారు. కళాక్షేత్రం వ్యవస్థాపకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి పర్యవేక్షించారు. సదస్సు ఎండీ సర్దార్ పాషా, షేక్ బాజీ మస్తాన్, బాజాన్, మూర్తి, అమీర్ భాషా, ఎస్. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మొదటి విద్యాధికారి శ్రీనాథుడే

ఏయూ ఆచార్య డాక్టర్ బూసి వెంకట స్వామి



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ఏయూ ఆచార్య డాక్టర్ బూసి వెంకట స్వామి

ఫిరంగిపురం, ఆగస్టు 25: దేశంలో మొట్టమొదటి విద్యాధికారి కవి సార్వభౌముడిగా వెలుగొందిన శ్రీనాథుడేనని ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్య డాక్టర్ బూసి వెంకట స్వామి అన్నారు. ఆదివారం ఫిరంగిపురంలోని వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో కొండవీడు రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఉభయ రాష్ట్రాల శతాధికార కవి సమ్మేళనం సభలో ఆయన మాట్లాడారు. సామాజిక చైతన్యం కోసమే కొండవీటి రచయితల సంఘం ఏర్పడటం ముదావాహం అన్నారు. మొదటిగా గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావు, శ్రీనివాస అయ్యర్‌లు భాషోద్యమాన్ని ఉప్పెనగా చేశారన్నారు. అనంతరం కృష్ణ శాస్త్రీ భావ కవిత్వాన్ని అందించారని తెలిపారు. అనంతరం అభ్యుదయ కవిత్వాన్ని కందుకూరి, రాయప్రోలు, గురజాడ, శ్రీశ్రీలు అందించారన్నారు. అనంతరం వచన, దిగంబర, దళిత కవిత్వం, బహుజన వాద కవిత్వం, హైస్కూల్ ఇలాంటి అనేక రకాల కవిత్వాలు తామర తంపరగా వచ్చాయన్నారు. 30 మంది వరకు పాల్గొన్న కవులు, రచయితలు, గాయకులు వచన కవిత్వం ద్వారా తెలుగు భాషను అద్వితీయంగా తెలిపారు. విశ్వ భాషలలో మేటి భాష తెలుగు భాష అని, ఆంధ్రా వైభవాన్ని అవనిలో చాటిన భాషా తెలుగు అని చెప్పారు. తెలుగు మనుగడ ప్రశ్నార్థకం కాకుండా చేయాలని తెలుగు తల్లి ఆర్థిస్తుందని, కవులు, రచయితలు తమ వచనాలు, గేయాలు, కవితల ద్వారా తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సయ్యద్ మహమ్మద్ రఫీ రచించి బాణీ కట్టిన పాటల క్యాసెట్‌ను విడుదల చేశారు. అలాగే చౌపాటి ప్రభాకర్ రచించిన పుస్తకాలను ఈఏ ఆచార్య జేసీ వెంకటస్వామి ఆవిష్కరించారు. కార్యదర్శి తోళ్ళమడుగు గోవిందయ్య, పరవస్తు చిన్నయ్య సూరి, వైసుందర్, కవులు, రచయితలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు అధికారాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏపీ కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎన్.తులసీ రెడ్డి

గుంటూరు (కార్పొరేషన్), ఆగస్టు 25: రాజ్యాంగంలో ఆర్టికల్ 243 పేర్కొనట్లుగా స్వయం పాలక ప్రభుత్వాలుగా స్థానిక సంస్థలకు అధికారాలివ్వాలని మాజీ రాజ్యసభ సభ్యులు, ఏపీ కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ యన్.తులసీరెడ్డి సూచించారు. గ్రామీణ, పట్టణ స్థానిక ప్రభుత్వాలకు విధులు, నిధులు, అధికారాలను బదిలీ చేస్తేనే బలోపేతం అవుతాయని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమౌతుందని వివరించారు. గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో స్థానిక ప్రభుత్వాల సాధికారతపై జరిగిన చర్చాగోష్టికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యన్. తులసీ రెడ్డి ప్రసంగిస్తూ గత రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల నిధులను దారి మళ్లించి వాటిని నిర్వీర్యం చేయడం దురదృష్టకరమన్నారు. వాలంటరీ, సచివాలయ వ్యవస్థలను పంచాయతీలకు సమాంతర వ్యవస్థలుగా మార్చి సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మిగిల్చినారన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందకుండా దేశాభివృద్ధిని ఆశించలేమన్నారు. శాసన మండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించకుండా రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి ఎలాంటి నిధులను స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వలేదన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్ కార్యాచరణ ద్వారా స్థానిక ప్రభుత్వాలు వికసిస్తాయన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే చేతుల్లో అధికారం కేంద్రీకృతం అవడం వలన అధికార, పాలన వికేంద్రీకరణకు ఆస్కారం లభించడం లేదన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాల నిధులు, విధులు, అధికారాల పై విస్తృతంగా చర్చలు జరగాలని, ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో గ్రామసభలు విజయవంతంగా జరిగాయని, కేంద్ర ఆర్థిక నిధులు విడుదలయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షులు పోతుల బాలకోటయ్య, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు, జన చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి పి శేషుబాబు, నేస్తం సహా వ్యవస్థాపకులు ధనుంజయ రెడ్డి ప్రసంగించారు.

ఏకగ్రీవంగా చేసిన తీర్మానాలు..

73వ రాజ్యాంగ సవరణలో గ్రామీణ ప్రాంతాల్లో పేర్కొన్న 29 అంశాలను, 74వ రాజ్యాంగ సవరణలో పట్టణ ప్రాంతాలకు పేర్కొన్న 18 అంశాలను దశల వారీగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు కేటాయించి అమలు చేయాలి. గ్రీన్ అంబాసిడర్స్ జీతాలు 6000 నుంచి 10,000 పెంచి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. 5 వ రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను వెంటనే స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయాలి. 15వ కేంద్ర ఆర్థిక సంఘం నిధులను ఇచ్చిన వెంటనే స్థానిక ప్రభుత్వాలకు ఎలాంటి జాప్యం లేకుండా బదిలీ చేయాలి. రాజకీయాలకు అతీతంగా సర్పంచులందర్నీ ఒకే విధంగా చూడాలి. ఉపాధి హామీ పథకాన్ని ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా అమలు చేయాలన్న తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

శత జయంతి ఉత్సవాల నిర్వహణకు ప్రాధాన్యం



సి.మృణాళిని

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 25: కవుల, రచయితల శత జయంతి ఉత్సవాల నిర్వహణకు సాహిత్య అకాడమీ ప్రాధాన్యమిస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం కన్వీనర్ సి.మృణాళిని చెప్పారు. ఆదివారం స్థానిక భువన చంద్ర టౌన్ హాల్‌లో జరిగిన బెల్లంకొండ రామదాసు శత జయంతి సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె సాహిత్య అకాడమీ చేపట్టే పలు సాహిత్య కార్యక్రమాల గురించి ఆంధ్రజ్యోతికి వివరించారు. తొలితరం రచయితలు, కవులు, వారి సాహిత్యం ఈ తరానికి తెలియజెప్పాలనే ఉద్దేశంతో జయంతి సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. నగరాల్లో కాకుండా ఆ రచయితలు పుట్టిన ఊర్లలోనే నిర్వహించాలని భావిస్తున్నట్లు చెప్పారు. బెల్లంకొండ రామదాసు పుట్టిన ఊరైన నరసరావుపేటలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అకాడమీ తరపున కవిసంధి, విమర్శకుడితో ఒక సాయంత్రం, మీట్ ద రైటర్ వంటి సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం తెలంగాణలో రెండు, ఆంధ్రాలో రెండు కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే నిజామాబాద్‌లో సాహిత్యంలో పర్యావరణంపై సదస్సు, సాహిత్యంలో ప్రపంచీకరణ అంశంపై బెనారస్‌లో సదస్సు చేసినట్లు చెప్పారు. ప్రచురణల విషయంలో జీవిత చరిత్రలకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఆమె తెలిపారు. దేశవ్యాప్తంగా ఢిల్లీలో ఆరు రోజులు సదస్సు జరుగుతుందని, తెలుగు రాష్ట్రాల నుంచి రచయితలకు ఆహ్వానం ఉంటుందని పేర్కొన్నారు. గొప్ప సాహిత్యకారుల జీవితాలపై డాక్యుమెంటరీ తీసే ప్రణాళిక చేస్తున్నట్లు చెప్పారు. అకాడమీ తరపున నిర్వహించే ప్రతి సదస్సును పుస్తక రూపంలో తీసుకొస్తామని చెప్పారు.

1.0634 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 25: నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శనివారం అర్ధరాత్రి వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0634 ఎంయూల విద్యుత్ తయారైందని ఎస్ఈ కె.వెంకట రమణ చెప్పారు. ప్రాజెక్టు 3 క్రస్ట్ గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 21,258, టేల్ రేస్ ఛానల్ ద్వారా 8,608 మొత్తంగా 29,866 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 29 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.46 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.053 టీఎంసీకి సమానమన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 25: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం నాటికి 589.50 అడుగులు ఉంది. ఇది 311.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,076 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,367 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,867 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 48,710 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 48,710 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 25: పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 48,541 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 57,952 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు. పవర్ జనరేషన్ ద్వారా 16 వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందని తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలు



క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేస్తున్న సీఆర్ క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు చెరుకూరి కాంతయ్య

చిలకలూరిపేట, ఆగస్టు 25: ఆంధ్రరాష్ట్ర క్యారమ్ సంఘ పర్యవేక్షణలో పల్నాడు జిల్లా క్యారమ్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ క్లబ్‌లో రెండు రోజులు పాటు జరిగిన రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు చెరుకూరి కాంతయ్య, రాష్ట్ర క్యారమ్స్ సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. శ్రీగిరిరాజు కృష్ణమూర్తి జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు రూ.25 వేలు క్రీడాకారులకు అందజేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. పురుషుల జట్టులో ప్రథమ స్థానం సీహెచ్ జనార్ధన్ రెడ్డి(విశాఖపట్నం), ద్వితీయ స్థానం బి.రవీంద్ర రెడ్డి (గుంటూరు), తృతీయ స్థానం జి.జయకుమార్ (గుంటూరు), నాలుగో స్థానం కె.ఉమామహేశ్వర రావు(ఎన్టీఆర్), 5వ స్థానం బి.పవన్ కుమార్(అనంతపూర్), 6వస్థానం టి.మల్లికార్జున (గుంటూరు). మహిళల విభాగంలో ప్రథమ స్థానం ఎంఎస్‌కే హారిక (విశాఖపట్నం), ద్వితీయ స్థానం ఎల్ హరిప్రియ (విశాఖపట్నం), తృతీయ స్థానం ఎన్.రాజ్యలక్ష్మి(గుంటూరు), 4వ స్థానం ఎస్‌కే హుస్నాసమీరా (విశాఖపట్నం) నిలిచారు. కార్యక్రమంలో జిల్లా క్యారమ్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చల్లగుంట్ల అజయ్ బాబు, బోయపాటి రవితేజ, రాష్ట్ర సంఘం ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుర్రా శ్రీనివాసరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్వీ రమణ మూర్తి, టోర్నమెంట్ కన్వీనర్ శర్మ, చీఫ్ రిఫరీ డీఎస్ఆర్ మూర్తి, అసిస్టెంట్ చీఫ్ రిఫరీ సిరాజ్ బాష పాల్గొన్నారు.

వెటరన్ టీ-20 క్రికెట్ విజేత గుంటూరు



చాంపియన్‌గా నిలిచిన గుంటూరు జట్టు

నెల్లూరు (విద్య), ఆగస్టు 25: నెల్లూరులోని సీఏఏ క్రికెట్ మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వెటరన్ టీ-20 క్రికెట్ పోటీల్లో గుంటూరు జట్టు చాంపియన్‌గా నిలిచింది. సీనియర్ క్రీడాకారుడు తాటిపర్తి సునీల్‌కుమార్ స్మృత్యర్థం వెటరన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు, నెల్లూరు జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 165 పరుగులు సాధించింది. ఎం.రాజాకృష్ణ 98 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసి విజేతగా నిలిచింది. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు పి.భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

చిలకలూరిపేట, ఆగస్టు 25: రోడ్డు ప్రమాదంలో బాలిక ఆదివారం దుర్మరణం చెందింది. ఈ మార్గంలో మద్దిరాల - పోతవరం గ్రామాల మధ్య తొలుత రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఒక ద్విచక్ర వాహనంపై తండ్రితో కలిసి ప్రయాణం చేస్తున్న బాలికను మృత్యువు వెంటాడింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనం పక్కనే వెళుతున్న గ్రానైట్ లోడు లారీ కింద బాలిక పడి అక్కడి కక్కడే మృతి చెందింది. మృతి చెందిన బాలిక మద్దిరాల గ్రామానికి చెందిన హసిఫా (15)గా పోలీసులు గుర్తించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ఉండవల్లి వద్ద రా వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ఉండవల్లి రా వాటర్ ప్లాంటు ఎప్పుడూ రన్నింగ్‌లోనే ఉండాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 25 : గుంటూరు నగర ప్రజలకు తాగునీరు అందించే ఉండవల్లి రా వాటర్ ప్లాంట్ 24 గంటలు రన్నింగ్‌లోనే ఉండాలని, అందుకు తగిన విధంగా మోటార్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ ఆదివారం ఉండవల్లిలోని ముడినీటి సరఫరా ప్లాంట్, రిజర్వాయర్లను పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ప్లాంట్‌లోని మోటార్ల సామర్థ్యం, గుంటూరు నగరానికి ప్రతి రోజు పంపింగ్ చేస్తున్న నీటి వివరాలు, ప్రకాశం బ్యారేజ్‌లోని నీటి లెవల్స్, విధుల్లో ఉన్న సిబ్బంది, తదితర అంశాలు అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ గుంటూరు నగరానికి తాగునీరు అందించే కీలకమైన ఉండవల్లి పంపింగ్ కేంద్రం పని తీరు మెరుగ్గా ఉండాలన్నారు. పంపింగ్ కేంద్రం 24 గంటలు పని చేయాలని, ఉన్న మోటర్లకు అదనంగా మరో మోటర్‌ని స్టాండ్ బైగా ఉంచాలన్నారు. బ్యారేజిలో నీటి నిల్వ వివరాలను ఎప్పటికప్పుడు తమకు తెలియచేయాలన్నారు. ప్లాంట్ పరిసరాల్లో సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. ప్లాంట్ ప్రాంతానికి చుట్టూ కాంపౌండ్ నిర్మాణం చేయాలని ఎస్‌ఈని ఆదేశించారు. పర్యటనలో ఎస్‌ఈ శ్యాం సుందర్, ఈఈ శ్రీనివాస్, డీఈఈ శ్రీధర్, గుంటూరు నగర రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీలకు ప్రాధాన్యం శుభపరిణామం

● గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసింది

● ఏపీసీసీ నేత తులసిరెడ్డి

గుంటూరు, ఆగస్టు 25: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించటంతో పాటు సభలు నిర్వహించటం శుభపరిణా మమని, దీన్ని తాము స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత ఎన్.తులసిరెడ్డి తెలిపారు. గుంటూరు రాజీవ్‌గాంధీభవన్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయాల పేరుతో రాజ్యాంగ పరంగా వచ్చిన పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కొత్త ప్రభుత్వం అన్న క్యాంటిన్‌లను తిరిగి అమల్లోకి తీసుకురావటం మంచిదే కానీ కేవలం పట్టణ ప్రాంతాలకే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కనీసం మేజర్ పంచాయతీల్లోనైనా అన్న క్యాంటిన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా పేదల కడుపునింపాలన్న అన్న క్యాంటిన్‌ల ముఖ్యోద్దేశం కూడా తీరుతుందన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ 6 పథకాలలో ఒక్క సామాజిక ఫించన్లు పంపిణీ పథకం మాత్రమే అమలు అవుతోందని, మిగతా ఐదు పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

త్వరలో ఏపీసీసీ కమిటీతో పాటు అన్ని కమిటీలు పూర్తి

ఇటీవల ఏపీసీసీతో పాటు అన్ని కమిటీలను ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఢిల్లీ వెళ్ళి కాంగ్రెస్ పెద్దలను కలిసి పార్టీ కమిటీలపై కూడా చర్చించారని తులసిరెడ్డి తెలిపారు. త్వరలో ఏపీసీసీ కమిటీతో పాటు డీసీసీ, నగర కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ మాత్రమే నిబద్ధతతో పని చేస్తుందన్నారు. ఏపీసీసీ నాయకుడు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పార్టీగా మరింత బలపడుతుందన్నారు. విలేకరుల సమావేశంలో కొమ్మినేని సురేష్, మొహమ్మద్ ఇంతియాజ్, జయేష్, ఆలి, మణి పలువురు నాయకులున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీసీ నేత తులసిరెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి, వినయ్‌కుమార్ తదితరులు

మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు

● 28న జిల్లా కలెక్టరేట్ ఎదుట రిలే నిరసన దీక్ష

గుంటూరు(తూర్పు), ఆగస్టు 25 : గత పది నెలల నుంచి సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు రావాల్సిన మెస్, కాస్మోటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చార్జీలు విడుదల చేయక పోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని వాపోయారు. అంతేగాకుండా గత ఏడు సంవత్సరాల నుంచి ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందలేదన్నారు. ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈ నెల 28న రిలే నిరసన దీక్ష కార్యక్రమం చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ గుంటూరులో ఉన్న కోడిగుడ్డు సత్రంకు, సమీకృత సంక్షేమ వసతి గృహ భవనానికి కోటి రూపాయలు కేటాయించి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, దుర్గా సాయి, అజయ్, వెంకటేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాన్సన్ బాబు, పాల్గొన్న నాసర్ జీ తదితరులు

స్కూల్‌గేమ్ కార్యదర్శిగా మల్లెంపూడి రవి

గుంటూరు(విద్య),ఆగస్టు 25: స్కూల్‌గేమ్ ఫెడరేషన్ కార్యదర్శిగా రేవేంద్ర పాడు జడ్పీ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు మల్లెంపూడి రవిని నియమిస్తూ డీఈవో ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేయాలని, విద్యార్థుల్ని క్రీడాకారులుగా తయారు చేసేలా వ్యాయామ ఉపాధ్యాయుల్ని ప్రోత్సహించాలని డీఈవో సూచించారు. నూతన కార్యదర్శి రవి మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు వినయ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశ్వరరావు, టి.వెంకటేశ్వరరావు, రమేష్, రిజిని నాయక్,హరికృష్ణ పాల్గొన్నారు.



డీఈవో నుంచి నియామక పత్రం అందుకుంటున్న రవి తదితరులు

రక్తదానంతో ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చు

● తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

గుంటూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అవసరమైన సమయంలో రక్తం అందించగలిగితే ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. లాలాపేటలోని బాలికోన్నత పాఠశాలలో డాక్టర్ రవికుమార్ స్ఫూర్తితో బాలాజీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని, రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని, ఆ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని ఆపదలో ఉన్న వారిని రక్తదానంతో ఆదుకుని వారి ప్రాణాలను కాపాడాలన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చే విధంగా ప్రజలను చైతన్యవంతం చేసే బాధ్యత యువత తీసుకోవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ రవి, హెల్పింగ్ హాండ్స్ ట్రస్టు సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, ప్రభాకర్, మనోజ్, శ్రీనివాస్, నూరుద్దీన్, సలీం, హఫీజ్‌పాల్గొన్నారు.



రక్తదాతలకు పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

బీసీ రిజర్వేషన్లు మరింత పెంచాలి

● డీఎంకే ఎంపీ విల్సన్ డిమాండ్

● ఘనంగా బీపీ మండల్ జయంతి వేడుకలు



బీపీ మండల్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్నఎంపీ విల్సన్, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కేశన శంకరరావు, బీసీ సంఘాల నాయకులు

గుంటూరు(విద్య),ఆగస్టు 25 : వెనుకబడిన కులాల సామాజిక అభివృద్ధి కోసం రాజ్యాంగ నిర్మాతలు రిజర్వేషన్ విధానాన్ని తీసుకువచ్చారని, వీటిని మరింత పెంచాలని డీఎంకే ఎంపీ విల్సన్ విజ్ఞప్తి చేశారు. బీపీ మండల్ 107వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి బీపీ మండల్ సేన అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఎంపీ విల్సన్ మాట్లాడుతూ రిజర్వేషన్లు ఇప్పటికీ 1931 జనాభా లెక్కల ప్రకారం అమలు చేస్తున్నారని, ప్రస్తుతం జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్ల అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లో బీసీలకు నామ మాత్రంగా అవకాశాలు కల్పిస్తున్నాయని, బీపీ మండల్ నివేదిక ప్రకారం 52 శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్లు 27 శాతానికి పరిమితం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది వై.ఠాగూర్‌యాదవ్, జిల్లా కోర్టు న్యాయవాది ప్రసాదరావు, రంగయ్య, కె.సుబ్రమణ్యం, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. తొలుత అమరావతి రోడ్డులోని బీపీ మండల్ విగ్రహానికి బీసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

బీపీ మండల్ సిఫార్సులను పూర్తి స్థాయిలో అమలు చేయాలి

గుంటూరు, ఆగస్టు 25 : సమాజంలో బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం బీపీ మండల్ చేసిన సిఫార్సులను పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, మండల్ కమిషన్‌కు నేతృత్వంలో వహించిన బిందేశ్వరి ప్రసాద్ మండల్ జయంతి కార్యక్రమం అమరావతి రోడ్డులోని గోరంట్ల ఇన్నర్‌రింగ్ రోడ్డు సెంటర్‌లో ఆదివారం జరిగింది. పలువురు బీసీ సంఘాల నాయకులు మండల్ విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, కొణిదెల మురళీకృష్ణ, మానేపల్లి దుర్గారావు, వలివేటి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, యాదగిరి, భాస్కరరావు తదితరులున్నారు.



మండల్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నేతలు

బీపీ మండల్‌కు బీసీ నేతల నివాళి

గుంటూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాల ఆరాధ్యుడు బీపీ మండల్ జయంతి సందర్భంగా ఇన్నర్ రింగ్‌రోడ్డులోని మండల్ విగ్రహానికి బీసీ నేతలు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్ల విషయంలో పలు ఉద్యమాలు చేసి ప్రజలకు అత్యంత చేరువైన వ్యక్తుల్లో బీపీ మండల్ ఒకరని అన్నారు. కార్యక్రమంలో గట్టి శ్రీనివాస్, వి.విజయలక్ష్మి, రామనాథం పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఈఎల్‌సీ ఆస్తులను పరిరక్షించాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 25: పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం ఎనలేని కృషి చేస్తున్న ఏఈఎల్‌సీ (ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ చర్చి) ఆస్తులను క్రైస్తవేతరులు, సంస్థలోని కొందరు స్వార్థ పరులు దోచుకునేందుకు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని దళిత, క్రైస్తవ, భీమ్ సేన సంఘాల నాయకులు అన్నారు. స్థానిక లాడ్జి సెంటర్‌లోని భీమ్ సేన్ కార్యాలయంలో ఆదివారం దళిత, క్రైస్తవ, భీమ్ సేన సంఘాల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భీమ్‌సేన అధ్యక్షుడు నేలపాటి నాగభూషణం మాట్లాడుతూ క్రైస్తవ సొసైటీలోకి అక్రమంగా కొంతమంది ప్రవేశించి వాటి ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమాలపై ప్రశ్నిస్తున్న వారిపై దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని వాపోయారు. సీనియర్ న్యాయవాది సంకూరి రాజారావు మాట్లాడుతూ క్రైస్తవుల ఆస్తులు క్రైస్తవులే అనుభవించాలని చట్టంలో ఉందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కమిటీ నియమించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కొండపల్లి విల్సన్, కంభం ఆనంద్‌కుమార్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న దళిత, క్రైస్తవ, భీమ్ సేన సంఘాల నాయకులు

ఆకట్టుకున్న శాస్త్రీయ గాత్ర సంగీత కచేరీ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 25 : స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ కళావేదికపై భారత్ వికాస్ పరిషత్ గుంటూరు శాఖ అధ్యక్షుడు చలమయ్య ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం యువ కళాకారులతో శాస్త్రీయ సంగీత కచేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ పాల్గొన్నారు. కళాకారులు సంపూర్ణలక్ష్మి, ఎం.సరయు శ్రీమాల్కోస్, బి.శ్రీకర్, కే.బృంద, లలిత రాజ్యలక్ష్మి, లక్షణ్యన్షని, రోహిత తమ గాత్ర కచేరీలో అనేక వాగ్గేయకార కీర్తనలను అద్భుతంగా ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వీరికి వయోలిన్‌పై పీ.జయతి, మృదంగంపై సిహెచ్ సూర్య చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి కే.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కళాకారులను, అతిధులను సత్కరించారు.



కచేరి చేస్తున్న యువ కళాకారులు

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ వెంటనే నిలిపివేయాలి

గుంటూరు, ఆగస్టు 25: రాష్ట్రంలో వ్యవసాయ పంపు సెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న ఒప్పందం ప్రకారం రాష్ట్రంలో గృహ, పారిశ్రామిక, వాణిజ్య విద్యుత్ కనెక్షన్‌లకు, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కోసం అదానీ సంస్థ సిద్ధమైందన్నారు. అంతేగాక ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసేందుకు విద్యుత్ సంస్థలు సిద్ధమవుతున్నాయని, ఫలితంగా వినియోగించే విద్యుత్‌కు ముందుగానే నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. తద్వారా వినియోగదారులపై అదనపు భారం పడనున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం ఈ ప్రక్రియను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

విదేశీయులు వస్తే 24 గంటల్లోగా తెలియజేయాలి

● ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఆగస్టు 25 : గుంటూరు జిల్లా పరిధిలో చదువుల రీత్యా, ఉద్యోగాల రీత్యా, బంధువులను చూడటానికి, టూరిజం ప్రదేశాల సందర్శన నిమిత్తం, వైద్య చికిత్స నిమిత్తం వచ్చే విదేశీయుల వివరాలను 24 గంటల్లోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా పోలీస్ శాఖకు తెలియజేయాలని ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. విదేశీయులకు వసతి కల్పించే ఏదైనా హోటల్/గెస్ట్ హౌస్/ధర్మశాల/ఇండివిడ్యువల్ హౌస్/యూనివర్సిటీ/హాస్పిటల్/ఇన్‌స్టిట్యూట్/ఇతర వసతులు కల ప్రదేశానికి విదేశీయులు వచ్చిన యెడల 24 గంటల లోపు ఇండియన్ ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓ డాట్ జీవోవి డాట్ ఇన్ అనే వెబ్‌సైట్‌కు ఫామ్‌సీని ఆన్‌లైన్ ద్వారా తెలియజేయాలన్నారు. సంబంధిత యజమాని వివరాలతో రిజిస్ట్రేషన్ కావాలన్నారు. అ తర్వాత నివాసముంటున్న విదేశీయుడి పాసుపోర్టు, వీసా వివరాలను, వచ్చిన తేదీ, సమయం వివరాలను, విదేశీయులు ఎన్ని రోజులు బస చేయదలచారో మొదలగు వివరాలు ఫొటోతో సహా ఫామ్‌సీలో నమోదు చేసి ఒక కాపీని విదేశీయునికి, మరో కాపీని స్పెషల్ బ్రాంచ్‌కు అందించాలని కోరారు. ఈ వివరాలు బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అధికారులకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా చేరుతుందన్నారు. వివరాలు నమోదు చేసేటప్పుడు ఏవైనా సందేహాలు ఉంటే స్పెషల్ బ్రాంచ్ ఆఫీస్‌కు 0863-2233351, 2233352 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. విదేశీయులకు వసతి కల్పించిన యజమానులు విదేశీయుల వివరాలు ఫామ్‌సీలో పొందుపరచని యెడల అట్టి వారిపై చట్ట ప్రకారం పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. అంతేకాకుండా జిల్లా ప్రజలకు ఎవరైనా అనుమానిత విదేశీయులు తారసపడినచో అటువంటి సమాచారంను డయల్ 100కు గాని, జిల్లా పోలీస్ అధికారి లేదా దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లోగాని, లేదా స్పెషల్ బ్రాంచ్ ఆఫీస్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

నేడు ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

గుంటూరు, ఆగస్టు 25 : జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రివెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమాన్ని సోమవారం కృష్ణాష్టమి పండుగ పర్వదినం సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లాలోని సదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు మరియు నగర పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు గమనించవలసినదిగా తెలియజేసారు.

బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుంటూరు, ఆగస్టు 25 : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 60 సంవత్సరాలు కలిగిన ఊరు పేరు, చిరునామా తెలియని వృద్ధుడు ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల 60 అడుగుల రోడ్డు చివర ఉన్న ఆటో స్టాండ్ వద్ద చనిపోయి రోడ్డుపై పడిపోయి ఉన్నాడు. గమనించిన అక్కడ చుట్టుప్రక్కల వారు తెలిపిన సమాచారం మేరకు, కొత్తపేట పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతుని గురించి చుట్టుపక్కల విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు మృతుని ఆచూకీ కొరకు ప్రయత్నం చేస్తున్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు కొత్తపేట పోలీస్‌స్టేషన్ ల్యాండ్ లైన్ నెంబర్ 0863-2221815కు గాని, సీఐ వీరయ్య 8688831320కు గానీ తెలియజేయాలని పోలీసులు కోరారు.

ఇద్దరిపై గంజాయి కేసు నమోదు

గుంటూరు, ఆగస్టు 25 : స్థానిక అరండల్‌పేట స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్టేషన్ పరిధిలోని వసంతరాయపురంనకు చెందిన మైనంపాటి వెంకటేశ్వర్లు, శ్రీనగర్‌కు చెందిన సాగిరి వెంకట శివరామకృష్ణ అనే ఇరువురి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గతంలో గంజాయి కేసులు ఉన్నట్లు అరండల్‌పేట సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ దాడి చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా నగరంపాలెం స్టేషన్ పరిధిలో కూడా ఇద్దరిని అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

గురువును మించిన దైవం లేదు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గురువును మించిన దైవం లేదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. ప్రైవేట్ స్కూల్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏసీ కాలేజీలో నిర్వహించిన టీచర్స్‌డే వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించే భావితరాలను గురువులే తీర్చి దిద్దుతారన్నారు. ఒక దేశం అత్యున్నత స్థాయికి ఎదగాలంటే అది గురువుల చేతిలోనే ఉంటుందని చెప్పారు. గురువులు చెప్పే పాఠాలు కేవలం మన వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా, సమాజాభివృద్ధికి కూడా ఎంతో తోడ్పడతాయని ఆమె అన్నారు. అలాంటి గురువులను గౌరవించుకునే సంప్రదాయం భారతీయ సంస్కృతిలోనే ఉందన్నారు. గురువులను సత్కరించే అవకాశం తనకు కలగడం సంతోషంగా ఉందన్నారు.

● లాలాపేటలోని ట్రైనింగ్ స్కూలులో జరిగిన స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి పాల్గొన్నారు. రక్తదాతలకు పండ్లు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

ఘనంగా ఈడే మురళీకృష్ణ జన్మదిన వేడుకలు

గుంటూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తెలుగుయువత ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షుడు ఈడే మురళీకృష్ణ జన్మదిన వేడుకలు గుంటూరు రూరల్ మండలం తురకపాలెం రోడ్డులోని ఈడే గెస్ట్‌హౌస్‌లో ఘనంగా జరిగాయి. రాజకీయ ప్రముఖులు, బిల్డర్లు, స్నేహితుల మధ్య జరిగిన వేడుకల్లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, డొక్కా మాణిక్యవరప్రసాద్ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. రాబోవు రోజుల్లో మంచి పదవులు పొంది రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. తరువాత పేదలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు కనపర్తి శ్రీనివాసరావు, మద్దిరాల మ్యాని, ఇక్కుర్తి మల్లికార్జునరావు, చెన్నంశెట్టి శివ, పీర్ అహమ్మద్ (బుజ్జి), యర్రంశెట్టి రవి, యర్రంశెట్టి సాయితేజ, కార్పొరేటర్లు, బిల్డర్లు పాల్గొన్నారు.



మురళీకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నసీర్, టీడీపీ నేతలు

కోరిటెపాడు ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 25 : గుంటూరు కోరిటెపాడు ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది చాగంటి రఘురామిరెడ్డి సమక్షంలో ప్రెసిడెంట్‌గా కన్నసాని బాజీ, వైస్ ప్రెసిడెంట్లుగా ఇమడాబత్తిని కోటేశ్వరరావు, అన్నం గంగాధర్, సెక్రటరీ బెజవాడ శివరామకృష్ణారెడ్డి, ట్రెజరర్‌గా ఓబులరెడ్డి, జిమ్ సెక్రటరీగా సత్యనారాయణ (సత్య), గార్డెన్‌గా లేళ్ళ రత్తయ్య, జాయింట్ సెక్రటరీ గల్లా గురుపాదం, ఈసీ మెంబర్లుగా రవీంద్ర, విష్ణువర్ధన్, రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి ఎన్నికయ్యారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా గాదె రత్నారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఏకగ్రీవంగా ఎన్నిక జరగటం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగంశెట్టి కోటేశ్వరరావు, గోరంట్ల మాజీ సర్పంచ్ కందుల సుబ్బారావు, కందుల వెంకయ్య, దాసరి శ్రీనివాసరావు (జననీ సీడ్స్) పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన కొరిటెపాడు ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

చదువుకు పేదరికం అడ్డుకాకూడదు

● జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

● ఆవోపా ఆధ్వర్యంలో ఉపకార వేతనాల పంపిణీ

గుంటూరు(విద్య), ఆగస్టు 25: పేదరికం ఎప్పటికి చదువుకు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ (ఆవోపా)చేస్తున్న కృషి అభినందనీయమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు. ఆవోపా ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీరామ్ రాజగోపాల్ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడిన తరువాత దాతల సహకారాన్ని విస్మరించరాదని విద్యార్థులకు సూచించారు. పేద వారికి సహాయం చేసినప్పుడే జన్మకు సార్థకత ఉంటుందనే విషయాన్ని విస్మరించరాదన్నారు. ఈ సందర్భంగా 220 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ.30 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రేన్ గ్రూపు సంస్థల చైర్మన్ గ్రంధి కాంతారావు, ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, కెవి బ్రహ్మం, ప్రేమ్‌కుమార్, నాగేశ్వరరావు, మహిళా విభాగం చైర్మన్ నిర్మల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, రాధాకృష్ణయ్య, మహంకాళి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, గ్రంధి కాంతారావు తదితరులు

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 25: శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.



దిక్సూచి
DIKSUCHI

"ప్రస్తుతం మనం అనుసరిస్తున్న పౌరస్మృతిలో మతతత్వ ఛాయలు ఉన్నాయి. మతం ఆధారంగా వివక్షను ప్రోత్సహించేలా ఉంది. దాని స్థానంలో 'లౌకిక పౌరస్మృతి'ని తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు కూడా అనేక సార్లు ఉమ్మడి పౌరస్మృతి గురించి చర్చించి, దీన్ని అమల్లోకి తేవాలని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దీంతో ఈ అంశం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా 'ఉమ్మడి పౌరస్మృతి' అంటే ఏమిటి? చట్టాలు వ్యక్తిగతంగా ఉండాలా? మత పరంగా ఉండాలా? లేదా దేశ పౌరులందరికీ ఒకే చట్టం వర్తింపు జేయాలా? అనే అంశాలను సమగ్రంగా చర్చిద్దాం.

ఉమ్మడి పౌరస్మృతి
'ఒకే దేశం - ఒకే చట్టం'

ఇండియన్ పాలిటీ

దొంగతనం, అత్యాచారం, హత్య... ఈ నేరాలు ఎవరు చేసినా వారి మతం, కులాలతో సంబంధం లేకుండా కోర్టులు శిక్షలు విధిస్తాయి. కానీ... పెళ్లి, విడాకులు, భరణం, దత్తత, వారసత్వం, మహిళలకు ఆస్తిహక్కు వంటి విషయాల్లో మాత్రం దేశ ప్రజలందరికీ ఒకే చట్టం వర్తించదు. హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు వారి వారి పర్సనల్ లాస్(మతం ఆధారంగా కల్పించిన వ్యక్తిగత చట్టాలు) ఆధారంగా శిక్షలు ఉంటాయి. అలాగే రాష్ట్రాలవారీగానూ అనేక చట్టాలు ఉన్నాయి. అలా కాకుండా పెళ్లి, విడాకులు, దత్తత, వారసత్వం, ఆస్తిహక్కు వంటి వాటి విషయాల్లో రాష్ట్రాలకు, మతాలకు అతీతంగా అందరికీ ఒకే చట్టం ఉండాలనే భావనకు ప్రతిరూపమే 'ఉమ్మడి పౌరస్మృతి'.

ఓ మైనర్ ముస్లిం బాలిక వివాహానికి సంబంధించి కేరళ హైకోర్టు ఇటీవల ఒక తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల లోపు వివాహం చేసుకునే హక్కు ఉందని బాలిక తండ్రి చేసిన వాదనను తిరస్కరించింది. 'ఏ వ్యక్తి

ముందు దేశపౌరుడు, ఆ తరవాతే మతం

అయినా ముందు దేశ పౌరుడని, ఆ తరవాతే ఆయా మతాల సభ్యులని పేర్కొంటూ..... హిందువైనా, ముస్లిమైనా, క్రిస్టియన్ అయినా.... అందరికీ బాల్య వివాహ నిషేధచట్టం(2006) వర్తిస్తుందని కేరళ హైకోర్టు 28 జూలై 2024న స్పష్టం చేసింది.

ఇతర దేశాల్లో ఉమ్మడి పౌరస్మృతి

- అమెరికాలో భిన్న మతాలను అవలంబించేవారు, భిన్న జాతులకు చెందిన ప్రజలు నివశిస్తున్నారు. అలాగని అక్కడ విడివిడిగా ప్రత్యేక చట్టాలు లేవు.
- ఫ్రాన్స్, జర్మనీ, చైనాలో కూడా మతాల ప్రాతిపదికన చట్టాలు లేవు.
- ఈజిప్ట్, మొరాకో, తుర్కియో వంటి ముస్లిం దేశాల్లోనూ అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక చట్టాలు లేవు.


పర్సనల్ లాస్

మన దేశంలో పౌరుల వ్యక్తిగత అంశాలైన పెళ్లి, ఆస్తులు, వారసత్వం, దత్తత వంటి వాటికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను మతం ఆధారంగా రూపొందించారు. అవి... హిందూ వివాహ చట్టం(1955), హిందూ వారసత్వ చట్టం(1956), హిందూ దత్తత నిర్వహణ చట్టం(1956); భారతీయ క్రైస్తవ వివాహ చట్టం(1957), భారత విడాకుల చట్టం(1969); పార్శీ వివాహ, విడాకుల చట్టం(1936), ముస్లిం పర్సనల్ లా అప్లికేషన్ యాక్ట్(1937), ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ చట్టాలు, కశ్మీర్ సంప్రదాయ చట్టాలు మొదలైనవి.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్



ఎలిజిబిలిటీ టెస్ట్

రీజనింగ్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్‌కి సంబంధించిన ఎలిజిబిలిటీ టెస్ట్ అనే ఈ టాపిక్‌కి చాలా ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా ఎస్.బి., బ్యాంకింగ్ మొదలైన పరీక్షల్లో ఈ విభాగం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ముందుగా ఏదైనా ఉద్యోగానికి, కళాశాలలో ప్రవేశానికి, బ్యాంకులో లోన్ లభించడానికి మొదలైన వివిధ అంశాలకు అర్హతలు నిర్ణయిస్తారు. తదుపరి వివిధ వ్యక్తుల వ్యక్తిగత సమాచారం (పర్సనల్ డేటా) తెలుసుకుంటారు. ఆ సమాచారంలోని అంశాలు ప్రశ్నలో ఇచ్చిన అర్హతలకు సరిపోయిందా లేదా పరిశీలించి దానిని బట్టి ఐచ్ఛికాలుగా ఎ, బి, సి, డి, ఇ లలో సరైన దానిని సమాధానంగా గుర్తించాలి. గ్రూప్ 1 కోచింగ్‌ను అందించే ఒక ప్రముఖ శిక్షణసంస్థలో ఉచిత కోచింగ్ ప్రవేశానికి విద్యార్థికి తప్పనిసరిగా కింది అర్హతలు ఉండాలి.

1. విద్యార్థి కచ్చితంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ చదివి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో తప్పనిసరిగా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
2. విద్యార్థి వయసు 2023 మే 25 నాటికి 22 సంవత్సరాలకు తగ్గకూడదు, 30 సం॥లకు మించకూడదు.
3. విద్యార్థి సంరక్షకుల వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదు.
4. విద్యార్థి కోచింగ్ శిక్షణాకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు లేదా పరీక్ష తేదీ వరకు (ఏదీ ముందు జరిగితే అలా) తప్పనిసరిగా కోచింగ్ నిర్వాహకులు తెలిపిన విధంగా ప్రిపరేషన్ కొనసాగిస్తూ శిక్షణసంస్థలోనే ఉండాలి.
5. ఆ సంస్థ ద్వారా ఉచిత కోచింగ్ పొంది ఉద్యోగానికి ఎన్నికైతే తప్పనిసరిగా ఆ సంస్థకు 50,000 రూపాయలను విరాళంగా ఇవ్వడానికి సుముఖత తెలుపుతూ అంగీకారపత్రంపై సంతకం చేయాలి.
6. పై వాటిలో ఒకటో అర్హతకు బదులుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 75% మార్కులు ఉన్నట్లయితే ఆ విద్యార్థి విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
7. పై వాటిలో అయిదో పాయింట్‌లో సూచించిన విధంగా అంగీకార పత్రానికి బదులు శిక్షణాకాలం జరుగుతున్న సమయంలోనే రూ.15,000/- చెల్లించడానికి సుముఖత తెలిపితే అభ్యర్థి విషయం కోచింగ్ సంస్థ (శిక్షణ సంస్థ) డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

పైన పేర్కొన్న అర్హతలు, నియమ నిబంధనలకు లోబడి కింద ఇచ్చిన వివిధ విద్యార్థుల వ్యక్తిగత సమాచారాన్ని ఆధారంగా చేసుకొని ఐచ్ఛికాల్లో తెలిపిన సమాధానాల్లో ఏది సరైనదో నిర్ణయించండి.

1. అవినాష్ ఎంటెక్ 70% మార్కులతో పూర్తి చేశాడు. పుట్టిన తేదీ 2002 జూన్ 1. అవినాష్ సంరక్షకుల వార్షికాదాయం రూ.96,000. అవినాష్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ దగ్గరే ఉండటానికి, అయిదో పాయింట్‌లో తెలిపినట్లు అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) అవినాష్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు
బి) అవినాష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
సి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
డి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) అవినాష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (డి)

వివరణ: అవినాష్ పుట్టిన తేదీ 2002 జూన్ 1. ప్రశ్నలో తెలిపిన 2023 మే 25 నాటికి అవినాష్‌కి 21 సంవత్సరాలు మాత్రమే. వయసు సరిపోదు కాబట్టి అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు.

2. దినేష్ ఎమ్మే 56% మార్కులతో పూర్తి చేశాడు. అతను పుట్టినతేదీ 1996 ఆగస్టు 24. డిగ్రీలో అతనికి 82% మార్కులు లభించాయి. దినేష్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.93,000/-. శిక్షణ పూర్తయిన తరవాత పరీక్ష తేదీ వరకు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు.

ఎ) దినేష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) దినేష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) దినేష్ ఇచ్చిన సమాచారం సరిపోదు.
డి) దినేష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది ఇ) దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది

సమాధానం: (ఇ)

వివరణ: దినేష్‌కు ఇచ్చిన అర్హతలలో 2, 3, 4, 5 అర్హతలు ఉన్నాయి. ఒకటో అర్హతకు బదులుగా 6వ పాయింట్‌లో తెలిపిన విధంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 82% మార్కులు పొందడం వలన దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

3. వికాస్ ఎమ్మెస్సీ 70% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.60,000/-. కోచింగ్ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దనే ఉండటానికి నిశ్చయించుకుని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) వికాస్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) వికాస్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) ఇచ్చిన సమాచారం సరిపోదు
డి) వికాస్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది
ఇ) వికాస్ విషయం శిక్షణాసంస్థ డైరెక్టర్ పరిశీనలకు వెళుతుంది

సమాధానం: (సి)

వివరణ: వికాస్ పుట్టినతేదీ గురించి ఎటువంటి సమాచారం లేదు.

4. తేజ ఎమ్మే 75% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.78,000/-. కాని శిక్షణ పొందడానికి 15,000/- చెల్లించడానికి అంగీకరించాడు. శిక్షణకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. కాని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేయలేదు. తేజ పుట్టిన తేదీ 1996 జూన్ 11.

ఎ) తేజ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
బి) తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
సి) తేజ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు డి) తేజ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) తేజ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (బి)

వివరణ: తేజకు ఇచ్చిన అర్హతలలో 1, 2, 3, 4 అర్హతలు ఉన్నాయి. అయిదో అర్హతకు బదులుగా ఏడో పాయింట్‌లో తెలిపిన విధంగా రూ.15,000/- చెల్లిస్తున్నందున తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

5. ప్రశాంత్ ఎంకామ్ 65% మార్కులతో పూర్తి చేశాడు. ప్రశాంత్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండడానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు. అతను పుట్టిన తేదీ 1994 ఏప్రిల్ 4. ప్రశాంత్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.1,20,000/-.

ఎ) ప్రశాంత్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
బి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అర్హుడు
సి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు
డి) ప్రశాంత్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు ఇ) ప్రశాంత్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (సి)

వివరణ: ప్రశాంత్ సంరక్షకుల వార్షికాదాయం రూ.1,20,000/-లు. మూడో అర్హతలో వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదని ఉన్నది. కాబట్టి ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

ప్రత్తిపాడు సీఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



సీఐ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, ఆగస్టు 25: ప్రత్తిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జీ శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు ఒంగోలు పీటీసీలో విధులు నిర్వహించారు. కొంతకాలంగా ప్రత్తిపాడు సీఐ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న నిస్సార్ బాషాను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఆయన స్థానంలో శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతలను పర్యవేక్షిస్తానని తెలిపారు. ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్రతో పాటు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

● 9 మంది అరెస్టు, రూ.15 వేలు స్వాధీనం

మంగళగిరి సిటీ, ఆగస్టు 25: మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై రూరల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఫ్లైఓవర్ కింద పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో ఎస్ఐలు చిరుమామిళ్ల వెంకట్, మధుసూదనరావు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి చేసి 9మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు.

నేడు షిర్డి సాయిబాబా మందిర వార్షికోత్సవం

తాడికొండ, ఆగస్టు 25: మోతడక గ్రామంలో షిర్డి సాయిబాబా మందిర 19వ వార్షికోత్సవం సోమవారం జరుగుతుందని ఆలయ కమిటీ ఛైర్మన్, టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటలకు బాబాకు కాకడా హారతి, మహన్యాస పూర్వక పంచామృత విశేష పాలాభిషేకాలు, విష్ణుసహస్ర నామార్చనం, శ్రీకృష్ణ కల్యాణం, దత్తాత్రేయుడికి అర్చన, ద్వాదశ ప్రదక్షిణలు జరుగునని తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగునని, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పుల్లడిగుంటలో వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఉప్పుటూరి చినరాములు, రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వట్టిచెరుకూరు, ఆగస్టు 25: మండలపరిధి పుల్లడిగుంటలోని ఎంపీపీ స్కూల్ ప్రాంగణంలో గ్రామానికి చెందిన ఉప్పుటూరి చినరాములు సేవాట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు అస్టర్ రమేష్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్‌చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి పుల్లడి గుంట గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ సౌమ్య, డాక్టర్ తేజ, డాక్టర్ బి.శ్రీలక్ష్మీ, డాక్టర్ సతీష్, డాక్టర్ సందీప్‌లు పాల్గొని వైద్య శిబిరానికి వచ్చిన వారికి గుండె, నరాలు, ఊపిరి తిత్తులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

విజయవాడ క్లబ్‌లో అలరించిన సంస్కృతి-2024

తాడేపల్లి, ఆగస్టు 25: ఎన్టీఆర్ జిల్లా గంగూరుకు చెందిన బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో సంస్కృతి-2024 పేరిట భారతీయ సంస్కృతీ, సంప్రదాయాల విశిష్టతను తెలియజేస్తూ పలు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ఛైర్మన్ అట్లూరి విజయబాబు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు సంప్రదాయాలను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

అధికారుల బదిలీలు పూర్తయితేనే అభివృద్ధి పనులకు శ్రీకారం

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

మేడికొండూరు ఆగస్టు 25: అధికారుల బదిలీలు పూర్తయిన వెంటనే నియోజకవర్గ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతానని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ చెప్పారు. మండలంలోని పేరేచర్ల గ్రామంలో నాలుగు రోజులుగా జరుగుతున్న అంకమ్మ, రేణుకమ్మ దేవర్ల కొలువుల్లో ఆయన ఆదివారం పాల్గొన్నారు. ఆలయంలో దేవర్లను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడికొండూరులోని ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలను జనసేన నేతలు అందజేసినా సీఎం ఫొటో పక్కన అధికారులు పెట్టకుండా నిర్లక్ష్యం వహించడంపై తనకు జనసేన నాయకులు సమాచారం అందించారని, దీనిపై అధికారులతో మాట్లాడి డిప్యూటీ సీఎం ఫొటోలను పెట్టిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పాములపాటి శివన్నారాయణ, పేరేచర్ల సర్పంచ్ దేవరకొండ రాజ్‌కుమార్, మైనారిటీ సెల్ నాయకులు షేక్ అబ్దుల్ ఘని తదితరులు పాల్గొన్నారు.



పేరేచర్లలో దేవర్ల కొలువులో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

వైభవంగా అంకమ్మ, రేణుకమ్మ దేవర్ల కొలువులు

పేరేచర్లలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన అంకమ్మ, రేణుకమ్మ దేవర్ల కొలువు మహోత్సవం ఆదివారం ముగిసింది. భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామస్థులతో పాటు వారి బంధువులు హాజరై దేవర్ల ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జాతర ముగింపు సందర్భంగా హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

మేడికొండూరు ఆగస్టు 25: గుంటూరు జిల్లా అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ (ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడిగా తెల్లమేకల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేడి కొండూరులో ఆదివారం జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా స్టేట్ జాయింట్ సెక్రటరి నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ శివ సూర్యతేజ హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో గుంటూరు జిల్లా ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో అధ్యక్షుడు శ్రీనివాసరావుతో పాటు కార్యదర్శిగా జాన్ వెస్లీ, కోశాధికారిగా అశోక్ బాబును తదితరులతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎంపికైన శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా తన ఎన్నికకు కృషి చేసిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ధన్యవాదాలు తెలిపారు. రేషనలైజేషన్, ప్రమోషన్ ఛానల్ కోసం పోరాడుతానని తెలియజేశారు.



జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావును సన్మానిస్తున్న సహచర సిబ్బంది

లంచం తీసుకొని సదరన్ నూతన సర్టిఫికెట్లు

తుళ్లూరు, ఆగస్టు 25: లంచం తీసుకొని దివ్యాంగుల సదరన్ సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారు. ప్రతి శుక్రవారం తుళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులను పరిశీలించి సర్టిఫికెట్లు ఇస్తున్నారు. గుంటూరు నుంచి వచ్చే డాక్టర్ల టీం ఈ సర్టిఫికెట్లను జారీ చేస్తుంది. ఒక్కొక్కరికి రూ.15 వేలు తీసుకొని అర్హత లేకపోయినా ఇస్తు న్నారు. ఇదిలా ఉంటే నిజమైన దివ్యాంగుల సదరన్ సర్టిఫికెట్ల రెన్యూవల్ చేయటానికి కూడా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వని వారికి అర్హత లేదని సర్టిఫికెట్ ఇస్తున్నారు. దీంతో రాబోయే రోజుల్లో అర్హత ఉన్న దివ్యాంగులు పింఛన్ కోల్పోయే అవకాశం ఉంది.

ముగిసిన చెరుకుమల్లి వారి జాతర



అమ్మవార్ల ప్రతిష్ఠాపన

వట్టిచెరుకూరు, ఆగస్టు 25: వట్టిచెరుకూరులోని చెరుకుమల్లి వారి రేణుక, గంగమ్మ తల్లుల మూడు రోజుల జాతర ఉత్సవం ఆదివారం తెల్లవారుజామున విగ్రహాల ప్రతిష్ఠతో కనుల పండువగా ముగిశాయి. ఉత్సవంలో భాగంగా శనివారం రాత్రి చెరుకుమల్లి కుటుంబాలకు చెందిన వారితో విచిత్ర వేషధారణలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు అంకురార్పణ

దుగ్గిరాల, ఆగస్టు 25: దుగ్గిరాలలో నూతనంగా ప్రతిష్ఠించనున్న అభయాంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా అంకురార్పణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సాయంత్రం టీటీడీ ఆచార్యులు వేదాంతం భట్టాచార్యులు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ రోడ్డుకు మరమ్మతులు



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, డిగ్రీ, జూనియర్ కళాశాలలకు వెళ్లే మార్గం మరమ్మతులు

దుగ్గిరాల, ఆగస్టు 25: మండలంలోని పలుగ్రామాల్లో జరిగిన గ్రామసభలో దృష్టిలోకి వచ్చిన ప్రజాసమస్యలకు స్పందించి చర్యలు తీసుకోవడం ప్రారంభించారు. దుగ్గిరాల గ్రామంలోని రామ్‌నగర్, గణేష్‌నగర్‌కు చెందిన ప్రజలు నడిచే మార్గం వర్షాలతో అధ్వానంగా మారిందని చర్యలు తీసుకోవాలని గ్రామసభలో ప్రజలు అర్జీ పెట్టుకున్నారు. సమస్యను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా, పంచాయతీ నేతృత్వంలో రోడ్డుకు మర మ్మతులు తక్షణమే చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. వెంటనే సిమెంట్ డస్ట్, చిప్స్‌ను వేయించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో గూడూరు వెంకట్రావు, గద్దె శ్రీనివాస్, వల్లూరు నరసింహారావు, పర్వతనేని హర్ష, చిరంజీవి, టైలర్ బాషా, వెంకటేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలకు తమిళనాడు బృందం

దుగ్గిరాల, ఆగస్టు 25: మండలపరిధి పెదపాలెంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను తమిళనాడు వ్యవసాయ పరిశోధనా సంస్థ నుంచి వచ్చిన బృందం ఆదివారం సందర్శించింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ సేంద్రియ ఎరువుల వినియోగంతోనే నాణ్యమైన ఉత్పత్తులకై తీసుకుం టున్న చర్యల గురించి స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామసర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్‌కు చెందిన 40ఎకరాల ప్రకృతి వ్యవసాయక్షేత్రాన్ని పరిశీలించారు. కృష్ణప్రసాద్‌తో పాటు మురళి పలు అంశాలను తమిళనాడు బృందానికి వివరించారు. డీఎం కె.రాజకుమారి, టీఎల్ జి.శ్రీనివాసరావు, ఎన్ఎఫ్ఏలు, సీఆర్పీ జయ, రైతులు పాల్గొన్నారు.

నేడు తాడేపల్లిలో కృష్ణాష్టమి వేడుకలు

తాడేపల్లి, ఆగస్టు 25: తాడేపల్లి కృష్ణ మందిరంలో శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్టు కృష్ణ మందిరం శ్రీకృష్ణ యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు, గోపూజ, తులసీ పూజ, అన్న సంతర్పణ, సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం, శ్రీపుష్పయాగం, శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావళి స్వామి వారికి ఊంజల్ సేవ, పవళింపు సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఉదయం 9 గంట లకు హాజరవుతారని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి తహసీల్దార్ కార్యాలయంలోనే చెల్లింపులు

తుళ్లూరు, ఆగస్టు 25: ఇసుక స్టాక్ పాయింట్‌ల వద్ద ఇక నుంచి డిజిటల్ పేమెంట్‌లు చెల్లించే పనిలేదు. ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో చెల్లింపు పక్రియ ఉంటుందని రెవెన్యూ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుళ్లూరు మండలపరిధిలోని తాళ్లాయపాలెం, లింగాయపాలెం రీచ్‌ల ఇసుక స్టాక్ పాయింట్‌ల క్యూఆర్ కోడ్‌తో ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా వినియోగదారులు చెల్లింపులు జరిపేవారు. ఇక నుంచి ఇసుక లోడింగ్ రసీదులు తీసుకోవటం కాని, ఆన్‌లైన్ పేమెంట్ అంతా తహసీల్దార్ కార్యాలయంలోనే జరగనుంది. అందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ తుళ్లూరు రెవెన్యూ కార్యాలయంలో ఇసుక లోడింగ్ కోసం పత్రాలు జారీ చేశారు.

చలపతి ఫార్మసీలో తెలుగు రాష్ట్రాల చెస్ పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

తాడికొండ, ఆగస్టు 25: చలపతి ఫార్మసీ కళాశాల, శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్, రాష్ట్ర చెస్ అసోసియేషన్ సం యుక్త ఆధ్వర్యంలో ఓపెన్ చెస్ పోటీలు మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో తెలుగు రాష్ట్రాల చెస్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. చెస్ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 255 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ రౌండ్లలో జరిగే పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.77,777లు నగదు బహుమతులను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన బీపీ మండల్

● బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్



బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పించిన బీసీ సంక్షేమ సంఘం నేతలు

మంగళగిరి సిటీ, ఆగస్టు 25: ఓబీసీల పితామహుడిగా చరిత్ర కెక్కిన బిందేశ్వరి ప్రసాద్ మండల్ బడుగుల జీవితాల్లో వెలుగులు నింపారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ అన్నారు. బీపీ మండల్ జయంతిని పురస్కరించుకుని మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీపీ మండల్ సూచనల ప్రకారం దేశ వ్యాపితంగా కుల గణన జరిపించి, ఓబీసీలకు సామాజిక న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు ఉప్పాల రాజ్‌కిరణ్, కాగితాల స్వాతి, వుడతా శ్రీనివాసరావు, తిరు వీధుల కిరణ్, కాట్రు ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



కాలువలో వ్యర్థాలు తొలగించక ముందు.. తర్వాత

కాలువలో వ్యర్థాలు తొలగింపు

● ఆంధ్రజ్యోతి కథనానికి అధికారుల స్పందన

తెనాలి రూరల్, ఆగస్టు 25: తెనాలి వైకుంఠపురం ఆలయ సమీపంలోని కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నాయని వాటిని తొలగించాలని కోరుతూ ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ ఈఈ మల్లికార్జునరావు స్పందించారు. కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను సిబ్బందితో తొలగింపజేశారు. కాలువ వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోందని, స్థానికులు ఇబ్బంది పడుతున్నారని ఆంధ్రజ్యోతి ప్రచురించడంతో సమస్య పరిష్కారం కాగా.. ఇందుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావును సన్మానిస్తున్న సహచర సిబ్బంది

ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ల సంఘం

జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

మేడికొండూరు ఆగస్టు 25: గుంటూరుజిల్లా అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ (ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడిగా తెల్లమేకల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేడికొండూరులో ఆదివారం జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ శివ సూర్యతేజ హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో గుంటూరు జిల్లా ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో అధ్యక్షుడే శ్రీనివాసరావుతో పాటు కార్యదర్శిగా జాన్ వెస్లీ, కోశాధికారిగా అశోక్ బాబును తదితరులతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంపికైన. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా తన ఎన్నికకు కృషి చేసిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ధన్యవాదాలు తెలిపారు. తమ చిరకాల సమస్యలైన రేషనలైజేషన్, ప్రమోషన్ ఛానల్ కోసం పోరాడుతానని ఈ సదర్భంగా ఆయన తెలియజేశారు.

సాంస్కృతిక చైతన్యం రగిలించిన దాశరథి

తెనాలి అర్బన్, ఆగస్టు 25 : భావ ప్రేరిత ప్రసంగాలతో సాంస్కృతిక చైతన్యం రగిలించిన దాశరథి మరిచిపోలేని మహావ్యక్తి అని స్వరలయ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సాయిలక్ష్మరాజు తెలిపారు. శ్రీవాసవీ ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి వేదిక ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాశరథి నిజాం ప్రభువులను సైతం గద్దిస్తూ రచనలు చేశారని, జిల్లాలలో సాహితీ చైతన్యం నిర్మించిన ఆయనను ప్రభుత్వం గుర్తించి కేంద్ర సాహిత్య అకాడమీ సత్కారం అందించిందన్నారు. గాయకులు సత్యవర్ధన్, సౌజన్య ఆలపించిన పలు గీతాలు శ్రోతలను అలరించాయి.



విద్యార్థినికి ఆర్థికసాయం అందిస్తున్న సంస్థ అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు

విద్యార్థినికి ఆర్థికసాయం

తెనాలి రూరల్, ఆగస్టు 25: మండలంలోని నందివెలుగు గ్రామంలో ఇంటర్ చదువుతున్న మంజూష అనే విద్యార్థినికి భరోసా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఆదివారం రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కఠిక శ్రీకాంత్ మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డుకాకూడదన్న ఉద్దేశంతో తాము విద్యార్థినికి సాయం చేశామన్నారు. ఆ విద్యార్థినికి రాబోయే రోజుల్లో ఉన్నత చదువులకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పేరం శ్రీలక్ష్మి, సెక్రటరీ రమేష్, జాయింట్ సెక్రటరీ నరిశెట్టి మహేశ్వరరావు, మరియు సంస్థ సభ్యులు సాంబశివరావు, శివన్నారయణ, పవన్‌కుమార్, మెళ్లపూడి శ్రీను, తన్నీరు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, సుబ్బారావు, రామరాజు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

విదేశీయులు వస్తే 24 గంటల్లోగా తెలియజేయాలి

● ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఆగస్టు 25: గుంటూరు జిల్లా పరిధిలో చదువు, ఉద్యోగం, బంధువులను చూడటానికి, టూరిజం ప్రదేశాల సందర్శన నిమిత్తం, వైద్య చికిత్స నిమిత్తం వచ్చే విదేశీయుల వివరాలను 24 గంటల్లోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా పోలీస్ శాఖకు తెలియజేయాలని ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. విదేశీయులకు వసతికల్పించే ఏదైనా హోటల్, గెస్ట్‌హౌస్, ధర్మశాల, వ్యక్తిగత ఇల్లు, యూనివర్సిటీ, హాస్పిటల్, ఇన్‌స్టిట్యూట్, ఇతర ప్రదేశానికి విదేశీయులు వస్తే 24 గంటల లోపు ఇండియన్‌ఎఫ్‌ఆర్‌ఆర్‌వో డాట్ జీవోవి డాట్ ఇన్ అనే వెబ్‌సైట్‌కు ఫామ్‌సీని ఆన్‌లైన్ ద్వారా తెలియజేయాలన్నారు. ముందుగా సంబంధిత యజమాని వివరాలతో రిజిస్ట్రేషన్ కావాలన్నారు. ఆ తర్వాత నివాస ముంటున్న విదేశీయుడి పాసుపోర్టు, వీసా వివరాలను, వచ్చిన తేదీ, సమయం, ఎన్ని రోజులు బస చేస్తున్నాడు వంటి వివరాలు ఫోటోతో సహా ఫామ్‌సీలో నమోదు చేసి ఒక కాపీని విదేశీయునికి, మరో కాపీని స్పెషల్ బ్రాంచ్‌కు అందించాలని కోరారు. ఈ వివరాలు బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అధికారులకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా చేరుతుందన్నారు. వివరాలు నమోదు చేయునప్పుడు ఏవైనా సందేహాలుంటే స్పెషల్ బ్రాంచ్ ఆఫీస్‌కు 0863-2233351, 2233352 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. విదేశీయులకు వసతి కల్పించిన యజమానులు విదేశీయుల వివరాలు ఫామ్‌సీలో పొందుపరచకుంటే, అట్టివారిపై చట్ట ప్రకారం పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. అంతేకాకుండా జిల్లా ప్రజలకు ఎవరైనా అనుమానిత విదేశీయులు తారసపడినా వారి సమాచారాన్ని డయల్ 100, జిల్లా పోలీస్ అధికారి, దగ్గరలోని పోలీస్‌స్టేషన్, స్పెషల్ బ్రాంచ్ ఆఫీస్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇద్దరిపై గంజాయి కేసు

గుంటూరు, ఆగస్టు 25: గుంటూరు అరండల్‌పేట స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసారు. స్టేషన్ పరిధిలోని వసంతరాయపురంకు చెందిన షైనంపాటి వెంకటేశ్వర్లు, శ్రీనగర్‌కు చెందిన సాగిరి వెంకట శివరామకృష్ణల రెండు కిలోల గంజాయిని కలిగి ఉండగా ఎస్ఐ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్‌లు వారిని గుర్తించి, అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గతంలో గంజాయి కేసులు ఉన్నట్లు అరండల్ పేట సీఐ శ్రీనివాసరావు తెలిపారు. అలాగే నగరంపాలెం స్టేషన్ పరిధిలోనూ ఇద్దరిని అరెస్ట్ చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలి

● 28న జిల్లా కలెక్టరేట్ ఎదుట రిలే నిరసన దీక్ష

గుంటూరు(తూర్పు), ఆగస్టు 25 : పది నెలల నుంచి సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు రావాల్సిన మెస్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చార్జీలు విడుదల చేయక పోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడంలేదని వాపోయారు. ఏడేళ్ల నుంచి పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందలేదన్నారు. ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈ నెల 28న రిలే నిరసన దీక్ష చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ, యశ్వంత్, దుర్గా సాయి, అజయ్, వెంకటేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా బహిరంగ మద్యపానం



రోడ్డుపైనే మద్యం తాగుతున్న మందుబాబులు

● తెనాలిలో ఎక్కడబడితే అక్కడే సిట్టింగ్‌లు
● ప్రభుత్వ ఆదేశాలకు యథేచ్ఛగా తూట్లు
● చిల్లర దుకాణాల్లో సైతం అమ్మకాలు
● అడ్డుకట్ట వేయకుంటే పరిస్థితి మరింత దారుణం..

తెనాలి రూరల్ ఆగస్టు 25: బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం పూర్తిగా నిషిద్ధం, అయినా దానిని అమలు చేసేవారే కనిపించకపోవడంతో మందుబాబులు యథేచ్ఛగా రోడ్లపైనే గుంపులుగా మద్యం తాగేస్తున్నారు. దీంతో రాష్ట్రంలో బహిరంగ మద్యపానం నిషిద్ధమేనా? అన్న సందేహాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం అమ్మకాలు లైసెన్సు పొందిన వైన్స్, బార్‌లలో మాత్రమే జరపాలి. అయితే వారికి కూడా కొన్ని నియమనిబంధనలు ఉంటాయి. వైన్స్ (బ్రాంది)షాపులలో కేవలం మద్యం బాటిళ్లు 90ఎమ్‌ఎల్ బాటిల్స్ మొదలుకుని ఫుల్‌బాటిల్ వరకూ విక్రయాలు జరపవచ్చు. అయితే ఆ బాటిల్స్‌ను లూజ్‌గా అమ్మకాలు జరపరాదు. పైగా వైన్స్‌షాపుల వద్ద పర్మిట్‌రూమ్‌కు ప్రభుత్వ అనుమతులు లేకుండా సిట్టింగ్ పెట్టి తాగించకూడదు. అయితే పలు వైన్స్‌లో ఆ నిబంధనలు అమలు కావడంలేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇక బార్ అండ్ రెస్టారెంట్లలో ఫుల్‌బాటిళ్లు, క్వార్టర్ బాటిల్స్ వంటివాటిని వెయిటర్ సహాయంతో అక్కడే సిట్టింగ్ పెట్టి లూజ్‌గా విక్రయించాల్సి ఉంటుంది. బార్ నుండి ఎట్టి పరిస్థితుల్లో క్వార్టర్ లేదా ఫుల్ బాటిళ్లు మద్యం బీర్లు వంటివి కూడా బయటకు అమ్మకాలు జరపకూడదు. ఇక బెల్ట్ షాపులు వంటివాటిని కూడా ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. సంబంధిన షాపుల నుండి మద్యం అధిక మొత్తంలో బయట వ్యక్తులకు అమ్మకూడదన్న నిబంధనలు కూడా ఆంక్షలు ఉన్నాయి. వీటికి విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహించకుండా పర్యవేక్షించేందుకు ఎక్సైజ్ శాఖ, అక్రమ రవాణా జరగకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ యంత్రాగం విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరించడంతో మద్యం నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడ పడితే అక్కడే ఏరులై పారుతుంది. తెనాలి పట్టణ, పరిసర గ్రామా ల్లో పేరుకు చిల్లర దుకాణాలు, కూల్‌డ్రింక్ షాపులు, హోటల్స్ వంటివిగా ఉంటూ అందులోనే మద్యం అమ్మకాలు పగులు రాత్రి తేడాలేకుండా జోరుగా సాగిస్తున్నారు. మద్యం లైసెన్స్ షాపుల్లో అమ్మకాలు జరిపే క్వార్టర్‌పై రూ.20-50 వరకూ డిమాండ్ మేరకు అధికంగా వసూలు చేస్తూ మద్యం ప్రియులవద్ద వ్యాపారులు వసూలు చేస్తూ అందినంత దండుకుంటున్నారు.



మార్కెట్లో ప్రధాన రోడ్డుపై మద్యం తాగుతూ ఇలా...

పట్టణంలో జనసంచారం అధికంగా ఉంటే మార్కెట్ ప్రధాన రోడ్డువద్ద మద్యంబాబులు నడక దారిలోనే బైటాయించి బహిరంగంగానే మద్యం తాగుతూ మత్తులో ఊగిపోతున్నారు. మరికొందరు ఆ ప్రాంతాల్లోని కూల్ డ్రింక్ షాపుల్లోనే మద్యం తాగుతూ అడిగేదెవరూ ఆపేదవన్న చందాన వ్యవహరిస్తున్నారు. మునిసిపల్ కాంప్లెక్స్ వెనుకవైపు నూతనంగా నిర్మిస్తున్న భవనంలో సైతం మందుబాబులు సిట్టింగులు పెట్టి ఇష్టానుసారంగా వ్యవహరిసున్నారు. మూడు శాఖల అధికారులు వీటిని పర్యవేక్షించాల్సి ఉండగా ఎక్కడా ఇది అమలు కాకపోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు బహరింగ మద్యపానం నిషిద్ధం అన్న ప్రభుత్వ ఆదేశాలు పట్టణంలో అమలు జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న మానవత సంస్థ సభ్యులు

మానవతా సంస్థ సేవలు అభినందనీయం

● తహసీల్దార్ కే.గోపాలకృష్ణ

తెనాలి అర్బన్, ఆగస్టు 25: మానవతా సంస్థ సమజానికి అందిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని తహసీల్దార్ కే.గోపాలకృష్ణ తెలిపారు. ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఇటీవల తెనాలి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన గోపాల కృష్ణను ఘనంగా సన్మానించారు. సంస్థ ఛైర్మన్ కొలసాని రాంచంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ, సమాజంలో విలువలు తగ్గిపోతున్న తరుణంలో సంస్థను ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నారని, దిగజారిపోతున్న విలువలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సంస్థ ప్రగతికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. రీజియన్ ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, కే.రామమోహనరావు, ప్రసాద్, శ్రీనివాస్, వెంకట్, సోమయ్యశాస్త్రి, కళ్యాణి, సత్యనారాయణ, ఆలపాటి వెంకట్రామయ్య, రోహిణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



లఖ్‌పతి దీదీ చెక్కులు అందజేస్తున్న అధికారులు, నాయకులు

మహిళలు ఆర్థికంగా వృద్ధిలోకి రావాలి

● టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సాంబిరెడ్డి

కొల్లిపర, ఆగస్టు 25 : మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన లఖ్‌పతి దీదీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన లకపతి దీదీ కార్యక్రమం గ్రామీణ మహిళల జీవితాలను మార్చేస్తోందన్నారు. అనంతరం లఖ్‌పతి దీదీలకు, సీఆర్పీలకు కూటమి నేతలు, అధికారులు చెక్కులను, సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీసీలు ఎం. శోభారాణి, ఎస్. యుగంధర్, ఎం.నాంచారయ్య, కూటమి నేతలు గుదిబండి గోవర్ధనరెడ్డి, కంచర్ల అమృతరాజు, భీమవరపు కిశోర్‌రెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు

నేడు ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

గుంటూరు, ఆగస్టు 25 : గుంటూరు జిల్లాలో ప్రతి. సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమాన్ని కృష్ణాష్టమి పండుగ పర్వదినం సందర్భంగా తాత్కాలికంగా రద్దుచేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యల నివేదన నిమిత్తం జిల్లా పోలీసు కార్యాలయానికి గుంటూరు జిల్లా పరిధిలోని వివధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు సోమవారం రాకుండా ఉండాలని, ఈ విషయాన్ని గమనించ వలసినదిగా ఎస్పీ కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు పరిశీలన

తెనాలి రూరల్, ఆగస్టు 25: మండల గ్రామాల్లో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించే పనిలో రూరల్ పోలీసులు నిమగ్నమయ్యారు. ప్రధాన రోడ్ల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేశారు. రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరరావు సూచనల మేరకు ఎస్ఐ కోటేశ్వరరావు స్టేషన్ సిబ్బందితో కలిసి నందివెలుగు, సంగం జాగర్లమూడి, పెదరావూరు, బుర్రిపాలెం, కొలకలూరు, హాఫ్‌పేట వంటి గ్రామాల్లో పర్యటించారు.



ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తెనాలిరూరల్,ఆగస్టు25: మండలంలోని పెదరావూరు హైస్కూల్లో ఆదివారం 2002-03 సంవత్సర పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిరపడినవారు ఈ సందర్భంగా పాఠశాలలో ఒక్కచోట కలసి ఒకరినొకరు యోగక్షేమాలను విచారించుకుని అలనాటి జ్ఞాపకాలను ముచ్చటించుకున్నారు. వారికి విద్యాబుద్ధులునేర్పిన గురువులైన తల్లం వెంకట సుబ్బారావు, కొడాలి రాజ్యలక్ష్మి, పమిడిముక్కల వరలక్ష్మి, షేక్ అబ్దుల్ సత్తార్, వరికూటి శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించి మెమోంటోలను అందజేసి వారి ఆశీస్సులు పొందారు.



పేదలకు ఆహారం పంపిణీ చేస్తున్న మిత్రమండలి సభ్యులు

పేదలకు అన్నదానం

తెనాలి, మారీసుపేట ఆగస్టు 25: శివసాయి గణేష్ మిత్రమండలి సభ్యులు ఆదివారం బొమ్మిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతినెల చివరి ఆదివారం మిత్రమండలి సభ్యులు, దాతల సహకారంతో పేదలకు అన్నదానం నిర్వహిస్తున్నమని తెలిపారు. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

గ్రామసభల పేరుతో పార్టీ సభలు..

తెనాలి రూరల్, ఆగస్టు 25: గ్రామసభల పేరుతో కూటమి ప్రభుత్వం ఆపార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించిందని వైసీపీ నేత, తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామసభల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించకుండా పార్టీ కేడర్ యోగక్షేమాలు విచారించిందని తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఇంత వరకూ అమలు చేయలేదన్నారు. వైసీపీ హయాంలో గ్రామసభలు జరపలేదని కూటమి ప్రభుత్వం ఆరోపించడం తగదన్నారు. సమావేశంలో చెన్నుబోయిన శ్రీనివాసరావు, పోతురెడ్డి, నరేంద్రరెడ్డి, అలీనగర్‌భాషా, కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.

సెలవు దినాల్లో తరగతులు నిర్వహించ వద్దు

● ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యకుడు వెంకటేష్

తెనాలి, మారీసుపేట ఆగస్టు 25: విద్యార్థులకు ప్రభుత్వ సెలవు దినాల్లో అక్రమంగా తరగతులు నిర్వహించ వద్దని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యకుడు పాశం వెంకటేష్ అన్నారు. పట్టణంలో పలు కార్పొరేట్ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు ప్రభుత్వ సెలవు దినాల్లో అక్రమంగా తరగతులను నిర్వహించడాన్ని ఏఐఎస్ఎఫ్ నేతలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ.. పట్టణంలోని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ సెలవు దినములు, ఆదివారంలలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని, ఈ విషయంపై ఎన్నిసార్లు హెచ్చరించినా వారిలో మార్పు రావటంలేదని మండిపడ్డారు. ఒత్తిడితో కూడిన బోధనతో విద్యార్థులు మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు చూస్తూనే ఉన్నామని, దీనిపై యాజమాన్యం, తల్లిదండ్రులు ఆలోచించాలని అన్నారు. ర్యాంకుల పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తూ ఎక్కువ సమయం క్లాసులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశాడు. పలుమార్లు ఎంఈవో, డీఈవోకి చెప్పినప్పటికి వారు సరైన స్పందన లేకపోవడం బాధాకరమని అన్నారు. కొన్ని సందర్భాలలో ఎంఈవోకి ఫిర్యాదు చేసినప్పటికీ 'మీరేవెళ్లి తరగతులను అడ్డుకోండి' అని మాకు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కళాశాలలపై, పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మద్దినేని కిరణ్ బాబు, పట్టణ కార్యదర్శి చెన్నూరి సాయి, భూమేష్, వివేక్, పండు, ఎర్రిమియా, తేజ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యకుడు వెంకటేష్, సాయి తదితరులు



యువకులతో కలసి జలాభిషేకాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

భక్తి శ్రద్ధలతో గ్రామ దేవత తిరునాళ్ల

● యువకులతో కలిసి జలాభిషేకాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, ఆగస్టు 25: మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో వేంచేసివున్న గ్రామ దేవత మెంట్లమ్మ తల్లి తిరునాళ్లను భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారు తిరునాళ్ల సందర్భంగా ఉదయం గ్రామ యువకుల ఆధ్వర్యంలో అమ్మవారికి జలాభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. పవిత్ర శ్రావణ మాసంలో వచ్చే 3వ ఆదివారం అమ్మవారికి తిరునాళ్లగా నిర్వహించటం అనవాయితీగా వస్తోంది. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, వర్షాలు సకాలంలో కురవాలని కోరుతూ గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు,చద్ది నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం యువత ఆధ్వర్యంలో ప్రభల ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంప్రదాయ డప్పు వాయిద్యాలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. ప్రజలు అధిక సంఖ్యలో ఉత్సవానికి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

27 నుంచి స్వర్ణ వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు

పొన్నూరుటౌన్, ఆగస్టు25 : సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయస్వామి దేవస్థాన ప్రాంగణంలో కొలువుతీరిన వెంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానునట్లు ఆలయ ఈవో టీ.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమలో భాగంగా 27వ తేది సాయంత్రం ధ్వజారోహనం, 28న స్వామి వార్ల కల్యాణ మహోత్సవం, 29న గరుడోత్సవం, మహా శాంతి హోమం, స్వామి వారి రథోత్సవం జరగనుందని తెలిపారు. 30న వసంతోత్సవం, చక్ర స్నానం, పూర్ణహూతి, సహస్రదిపాలకరణ, పవలింప సేవలు చేయనున్నారు. 31న పుష్పయాగం, స్వామి వార్ల తెపోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ బ్రహోత్సవాలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు

సమాజంలో మంచి మనుషులుగా మెలగాలి

● రౌడీషీటర్ల కౌన్సెలింగ్‌లో ఎస్ఐ కోటేశ్వరరావు

తెనాలి రూరల్, ఆగస్టు 25: సమాజంలో మంచి మనుషులుగా తోటివారికి సాయం అందిస్తూ సత్ప్రవర్తనతో మెలగాలని రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కోటేశ్వరరావు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో రౌడీషీటర్లుగా పేరు పొందారని, ఇక నుంచైనా మంచి పనులు చేస్తూ కుటుంబానికి చేదుదువాదోడుగా ఉంటూ ప్రశాంత జీవితాన్ని గడపాలని సూచించారు. గొడవలకు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ మంచి జీవితం గడపాలన్నారు. రౌడీషీటర్లపై పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందని హెచ్చరించారు.



కవి సత్కారం అందుకుంటున్న ఉపాధ్యాయుడు మండె సుబ్రహ్మణ్యం

ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంకు కవి సత్కారం

పొన్నూరుటౌన్, ఆగస్టు25 : పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మండె సుబ్రహ్మణ్యంకు కవి సత్కారం లభించింది. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఫిరంగిపురంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కొండవీడు రచయితల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి శతాధిక కవి సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో పొన్నూరుకు చెందిన మండె సుబ్రహ్మణ్యం పాల్గొని 'లెస్స భాష విశ్వతార' అనే కవితా శీర్షికతో తెలుగు భాషా కీర్తిని చాటి చెప్పినందుకు అతనికి కవి సత్కారం లభించింది. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు ఘన సాహితి పురస్కారాన్ని అందచేసారు. అనంతరం కో.ర.సం అధ్యక్షుడు సయ్యద్ మొహ్మద్ రఫీ, ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి, గుర్రం జాషువా పరిషత్ అధ్యక్షుడు యోహాను తదితరులు సుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఇస్కాన్ మందిర ప్రతినిధులు

ప్రతి ఒక్కరూ భగవద్గీత సారం గ్రహించాలి

● ఇస్కాన్ మందిర నిర్వాహకుడు సింహగౌరదాస్


తెనాలి అర్బన్, ఆగస్టు 25 : శ్రీకృష్ణ పరమాత్ముడు బోధించిన భగవద్గీతలోని సారాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని ఇస్కాన్ మందిర నిర్వాహకుడు సింహగౌరదాస్ సూచించారు. నాజరుపేటలోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని పట్టణ, డివిజన్‌లోని పలు గ్రామాల్లో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, అర్థాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మూడు వేల మంది విద్యార్థులు పాల్గొనగా 400 మంది విద్యార్థులు అవగాహన చేసుకుని బహుమతులు గెలుచుకున్నారు. విజేతలందరికి ఆదివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గీతా గ్రంథాన్ని ప్రతి ఒక్కరూ తమ గృహంలో ఉంచుకుని అధ్యయనం చేయాలన్నారు. గోపీనాథ్‌దాస్, జనార్ధన్ దాస్, కొత్త సుబ్రహ్మణ్యం, కొల్లా ధర్మకుమార్ తదితరులు ప్రసంగించారు.

బయోటెక్నాలజీలో సింధూకు గోల్డ్ మెడల్

తెనాలి అర్బన్, ఆగస్టు 25 : తెనాలికి చెందిన దీవి సర్వజ్ఞ సింధూ బయోటెక్నాలజీలో గోల్డ్‌మెడల్ అందుకుంది. విజ్ఞాన్ యూనివర్సిటీలో చదువుతున్న సింధూ 9.66 గ్రేడ్ సాధించి గోల్డ్‌మెడల్, బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్ అవార్డు దక్కించుకుంది. విజ్ఞాన్ కళాశాల స్నాతకోత్సవంలో ఈఅవార్డులను తల్లిదండ్రులు వేణుగోపాల్, అనంతలక్ష్మిలతో కలిసి అందుకుంది. సింధూని వైఖానస సేవా సంఘం ప్రతినిధులు అభినందించారు.



అవార్డులతో సింధూ



దిక్సూచి
DIKSUCHI

"ప్రస్తుతం మనం అనుసరిస్తున్న పౌరస్మృతిలో మతతత్వ ఛాయలు ఉన్నాయి. మతం ఆధారంగా వివక్షను ప్రోత్సహించేలా ఉంది. దాని స్థానంలో 'లౌకిక పౌరస్మృతి'ని తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు కూడా అనేక సార్లు ఉమ్మడి పౌరస్మృతి గురించి చర్చించి, దీన్ని అమల్లోకి తేవాలని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దీంతో ఈ అంశం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా 'ఉమ్మడి పౌరస్మృతి' అంటే ఏమిటి? చట్టాలు వ్యక్తిగతంగా ఉండాలా? మత పరంగా ఉండాలా? లేదా దేశ పౌరులందరికీ ఒకే చట్టం వర్తింప జేయాలా? అనే అంశాలను సమగ్రంగా చర్చిద్దాం.

ఉమ్మడి పౌరస్మృతి
'ఒకే దేశం - ఒకే చట్టం'

ఇండియన్ పాలిటీ

దొంగతనం, అత్యాచారం, హత్య... ఈ నేరాలు ఎవరు చేసినా వారి మతం, కులాలతో సంబంధం లేకుండా కోర్టులు శిక్షలు విధిస్తాయి. కానీ... పెళ్లి, విడాకులు, భరణం, దత్తత, వారసత్వం, మహిళలకు ఆస్తిహక్కు వంటి విషయాల్లో మాత్రం దేశ ప్రజలందరికీ ఒకే చట్టం వర్తించదు. హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు వారి వారి పర్సనల్ లాస్(మతం ఆధారంగా కల్పించిన వ్యక్తిగత చట్టాలు) ఆధారంగా శిక్షలు ఉంటాయి. అలాగే రాష్ట్రాలవారీగానూ అనేక చట్టాలు ఉన్నాయి. అలా కాకుండా పెళ్లి, విడాకులు, దత్తత, వారసత్వం, ఆస్తిహక్కు వంటి వాటి విషయాల్లో రాష్ట్రాలకు, మతాలకు అతీతంగా అందరికీ ఒకే చట్టం ఉండాలనే భావనకు ప్రతిరూపమే 'ఉమ్మడి పౌరస్మృతి'.

ఇతర దేశాల్లో ఉమ్మడి పౌరస్మృతి

- అమెరికాలో భిన్న మతాలను అవలంబించేవారు, భిన్న జాతులకు చెందిన ప్రజలు నివశిస్తున్నారు. అలాగని అక్కడ విడివిడిగా ప్రత్యేక చట్టాలు లేవు.
- ఫ్రాన్స్, జర్మనీ, చైనాలో కూడా మతాల ప్రాతిపదికన చట్టాలు లేవు.
- ఈజిప్ట్, మొరాకో, టర్కియో వంటి ముస్లిం దేశాల్లోనూ అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక చట్టాలు లేవు.

> ఓ మైనర్ ముస్లిం బాలిక వివాహానికి సంబంధించి కేరళ హైకోర్టు ఇటీవల ఒక తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల లోపు వివాహం చేసుకునే హక్కు ఉందని బాలిక తండ్రి చేసిన వాదనను తిరస్కరించింది. 'ఏ వ్యక్తి
>
> **ముందు దేశపౌరుడు, ఆ తరవాతే మతం**
>
> అయినా ముందు దేశ పౌరుడని, ఆ తరవాతే ఆయా మతాల సభ్యులని పేర్కొంటూ..... హిందువైనా, ముస్లిమైనా, క్రిస్టియన్ అయినా.... అందరికీ బాల్య వివాహ నిషేధచట్టం(2006) వర్తిస్తుందని కేరళ హైకోర్టు 28 జూలై 2024న స్పష్టం చేసింది.

పర్సనల్ లాస్


మన దేశంలో పౌరుల వ్యక్తిగత అంశాలైన పెళ్లి, ఆస్తులు, వారసత్వం, దత్తత వంటి వాటికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను మతం ఆధారంగా రూపొందించారు. అవి... హిందూ వివాహ చట్టం(1955), హిందూ వారసత్వ చట్టం(1956), హిందూ దత్తత నిర్వహణ చట్టం(1956); భారతీయ క్రైస్తవ వివాహ చట్టం(1957), భారత విడాకుల చట్టం(1969); పార్శీ వివాహ, విడాకుల చట్టం(1936), ముస్లిం పర్సనల్ లా అప్లికేషన్ యాక్ట్(1937), ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ చట్టాలు, కశ్మీర్ సంప్రదాయ చట్టాలు మొదలైనవి.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం



ఎలిజిబిలిటీ టెస్ట్

రీజనింగ్

రీజనింగ్‌కి సంబంధించిన ఎలిజిబిలిటీ టెస్ట్ అనే ఈ టాపిక్‌కి చాలా ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా ఎస్.ఐ., బ్యాంకింగ్ మొదలైన పరీక్షల్లో ఈ విభాగం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ముందుగా ఏదైనా ఉద్యోగానికి, కళాశాలలో ప్రవేశానికి, బ్యాంకులో లోన్ లభించడానికి మొదలైన వివిధ అంశాలకు అర్హతలు నిర్ణయిస్తారు. తదుపరి వివిధ వ్యక్తుల వ్యక్తిగత సమాచారం (పర్సనల్ డేటా) తెలుసుకుంటారు. ఆ సమాచారంలోని అంశాలు ప్రశ్నలో ఇచ్చిన అర్హతలకు సరిపోయిందా లేదా పరిశీలించి దానిని బట్టి ఐచ్ఛికాలుగా ఎ, బి, సి, డి, ఇ లలో సరైన దానిని సమాధానంగా గుర్తించాలి. గ్రూప్ 1 కోచింగ్‌ను అందించే ఒక ప్రముఖ శిక్షణసంస్థలో ఉచిత కోచింగ్ ప్రవేశానికి విద్యార్థికి తప్పనిసరిగా కింది అర్హతలు ఉండాలి.

1. విద్యార్థి కచ్చితంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ చదివి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో తప్పనిసరిగా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
2. విద్యార్థి వయసు 2023 మే 25 నాటికి 22 సంవత్సరాలకు తగ్గకూడదు, 30 సం॥లకు మించకూడదు.
3. విద్యార్థి సంరక్షకుల వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదు.
4. విద్యార్థి కోచింగ్ శిక్షణాకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు లేదా పరీక్ష తేదీ వరకు (ఏదీ ముందు జరిగితే అలా) తప్పనిసరిగా కోచింగ్ నిర్వాహకులు తెలిపిన విధంగా ప్రిపరేషన్ కొనసాగిస్తూ శిక్షణసంస్థలోనే ఉండాలి.
5. ఆ సంస్థ ద్వారా ఉచిత కోచింగ్ పొంది ఉద్యోగానికి ఎన్నికైతే తప్పనిసరిగా ఆ సంస్థకు 50,000 రూపాయలను విరాళంగా ఇవ్వడానికి సుముఖత తెలుపుతూ అంగీకారపత్రంపై సంతకం చేయాలి.
6. పై వాటిలో ఒకటో అర్హతకు బదులుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 75% మార్కులు ఉన్నట్లయితే ఆ విద్యార్థి విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
7. పై వాటిలో అయిదో పాయింట్‌లో సూచించిన విధంగా అంగీకార పత్రానికి బదులు శిక్షణా కాలం జరుగుతున్న సమయంలోనే రూ.15,000/- చెల్లించడానికి సుముఖత తెలిపితే అభ్యర్థి విషయం కోచింగ్ సంస్థ (శిక్షణ సంస్థ) డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

పైన పేర్కొన్న అర్హతలు, నియమ నిబంధనలకు లోబడి కింద ఇచ్చిన వివిధ విద్యార్థుల వ్యక్తిగత సమాచారాన్ని ఆధారంగా చేసుకొని ఐచ్ఛికాల్లో తెలిపిన సమాధానాల్లో ఏది సరైనదో నిర్ణయించండి.

1. అవినాష్ ఎంటెక్ 70% మార్కులతో పూర్తి చేశాడు. పుట్టిన తేదీ 2002 జూన్ 1. అవినాష్ సంరక్షకుల వార్షికాదాయం రూ.96,000. అవినాష్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ దగ్గరే ఉండటానికి, అయిదో పాయింట్‌లో తెలిపినట్లు అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) అవినాష్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు
బి) అవినాష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
సి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
డి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) అవినాష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (డి)

వివరణ: అవినాష్ పుట్టిన తేదీ 2002 జూన్ 1. ప్రశ్నలో తెలిపిన 2023 మే 25 నాటికి అవినాష్‌కి 21 సంవత్సరాలు మాత్రమే. వయసు సరిపోదు కాబట్టి అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు.

2. దినేష్ ఎమ్మే 56% మార్కులతో పూర్తి చేశాడు. అతను పుట్టినతేదీ 1996 ఆగస్టు 24. డిగ్రీలో అతనికి 82% మార్కులు లభించాయి. దినేష్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.93,000/-. శిక్షణ పూర్తయిన తరవాత పరీక్ష తేదీ వరకు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు.

ఎ) దినేష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) దినేష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) దినేష్ ఇచ్చిన సమాచారం సరిపోదు.
డి) దినేష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది ఇ) దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది

సమాధానం: (ఇ)

వివరణ: దినేష్‌కు ఇచ్చిన అర్హతలలో 2, 3, 4, 5 అర్హతలు ఉన్నాయి. ఒకటో అర్హతకు బదులుగా 6వ పాయింట్‌లో తెలిపిన విధంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 82% మార్కులు పొందడం వలన దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

3. వికాస్ ఎమ్మెస్సీ 70% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.60,000/-. కోచింగ్ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దనే ఉండటానికి నిశ్చయించుకుని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) వికాస్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) వికాస్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) ఇచ్చిన సమాచారం సరిపోదు
డి) వికాస్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది
ఇ) వికాస్ విషయం శిక్షణాసంస్థ డైరెక్టర్ పరిశీనలకు వెళుతుంది

సమాధానం: (సి)

వివరణ: వికాస్ పుట్టినతేదీ గురించి ఎటువంటి సమాచారం లేదు.

4. తేజ ఎమ్మే 75% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.78,000/-. కాని శిక్షణ పొందడానికి 15,000/- చెల్లించడానికి అంగీకరించాడు. శిక్షణకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. కాని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేయలేదు. తేజ పుట్టిన తేదీ 1996 జూన్ 11.

ఎ) తేజ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
బి) తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
సి) తేజ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు డి) తేజ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) తేజ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (బి)

వివరణ: తేజకు ఇచ్చిన అర్హతలలో 1, 2, 3, 4 అర్హతలు ఉన్నాయి. అయిదో అర్హతకు బదులుగా ఏడో పాయింట్‌లో తెలిపిన విధంగా రూ.15,000/- చెల్లిస్తున్నందున తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

5. ప్రశాంత్ ఎంకామ్ 65% మార్కులతో పూర్తి చేశాడు. ప్రశాంత్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండడానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు. అతను పుట్టిన తేదీ 1994 ఏప్రిల్ 4. ప్రశాంత్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.1,20,000/-.

ఎ) ప్రశాంత్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
బి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అర్హుడు
సి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు
డి) ప్రశాంత్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు ఇ) ప్రశాంత్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (సి)

వివరణ: ప్రశాంత్ సంరక్షకుల వార్షికాదాయం రూ.1,20,000/-లు. మూడో అర్హతలో వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదని ఉన్నది. కాబట్టి ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

అటకెక్కిన 'ఫిష్ ఆంధ్ర'

వైసీపీ హయాంలో వస్తు సామగ్రి కొనుగోలులో భారీ అవినీతి

- లబ్ధిదారులకు భారమైన ఫ్రాంచైజీ, బ్రాండింగ్
- వినియోగదారుల నుంచి కరువైన ఆదరణ
- లక్షల్లో నష్టపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత



అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికే 'ఫిష్ ఆంధ్ర' అంటూ దప్పు కొట్టిన వైసీపీ ప్రభుత్వం... ఆచరణలో భారీ అవినీతికి తెరతీసింది. వైసీపీ పార్టీ రంగులతో, ప్రచార ఆర్భాటంతో ఆరంభమైన 2,300 యూనిట్లలో చాలా వరకూ మూతపడ్డాయి. లబ్ధిదారులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు రూ.లక్షల్లో నష్టపోయారు. టీడీపీ ప్రభుత్వం దీనిపై దృష్టిపెడితే అవినీతి చేపలు దొరికే అవకాశం ఉంది. లబ్ధిదారులకు నగదు రాయితీ ఇచ్చి, నిర్దేశిత ప్రమాణాలతో రిటైల్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పాల్సిన మత్స్య శాఖ... ఫ్రాంచైజీ రుసుము చెల్లించాలని, పరికరాలను తాము చెప్పిన సంస్థ నుంచే తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడే అవినీతి, అవకతవకలకు ఆస్కారం ఏర్పడింది. 'ఫిష్ ఆంధ్ర కాస్తా... 'స్కామ్ ఆంధ్ర'గా మారింది. వస్తు సామాగ్రిని తమకు అనుకూలమైన సంస్థల నుంచి కొనుగోలు చేయించి, నిధుల గోల్‌మాల్‌కు తెరదీశారు. బ్యాంకు రుణం, కేంద్రం, లబ్ధిదారుని వాటా నిధులతో వస్తు సామాగ్రి కొనుగోలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన తనవంతు వాటాను విడుదల చేయలేదు. లైవ్ ఫిష్ టబ్, బల్లలు, చేపలు శుద్ధి చేసే పనిముట్లు, శీతలీకరణకు రిఫ్రిజిరేటర్, ఐస్ తయారీ యంత్రం తదితర వస్తువులు... నాణ్యత ఏ మాత్రం లేని వాటిని ఎక్కువ ధరకు కొనుగోలు చేయించారు. లోగుట్టుగా అవినీతికి పాల్పడిన వైసీపీ నేతలు, అధికారులు... ప్రచారాన్ని మాత్రం ఊదరకొట్టారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20,000 మందికి ఉపాధి లభించిందని వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. ఫ్రాంచైజీ పేరుతో ఆరంభంలో రూ.80 వేలు వసూలు చేసిన మత్స్య శాఖ... ఫిష్ ఆంధ్ర బ్రాండింగ్ కోసం ప్రతి నెలా రూ.7,000 చెల్లించాలన్న నిబంధన పెట్టింది. ప్రారంభించిన కొద్ది నెలలకే కొనుగోలు చేసిన వస్తు సామాగ్రిలో చాలా వరకూ మూలకు చేరింది. నిర్వహణ భారమయింది. లైవ్ ఫిష్ వ్యాపారానికి ఆదరణ లభించలేదు. దీంతో ఫిష్ ఆంధ్ర అటకెక్కింది. మళ్లీ 20 వేల మంది రోడ్డుపైకి వచ్చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పథకం తీరుతెన్నులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అనేక అవకతవకలు బయటపడతాయి.

156 ఔషధాలపై కేంద్రం నిషేధం!

- జాబితాను విడుదల చేసిన ఔషధ నియంత్రణ శాఖ

గుంటూరు(మెడికల్), ఆగస్టు 25: ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని 156 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) మందులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. తక్షణం వీటి తయారీ, పంపిణీ, విక్రయాలు నిలిపివేయాలని కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. నిషేధించిన మందుల్లో పలు యాంటీ బయోటిక్, యాంటీ అలర్జీ, అధిక రక్తపోటు, నొప్పి నివారణ మందులు, మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లు తదితరాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నియమించిన డ్రగ్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) సూచనల మేరకు ఈ మందులపై కేంద్ర ఆరోగ్య శాఖ నిషేధం విధించింది. ఈ మేరకు ఈనెల 12వ తేదీన గెజిట్ నోటిఫికేషన్‌ను వెలువరించింది. నిషేధ మందుల జాబితాను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపింది. తాజాగా గుంటూరు జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఆ నిషేధిత మందుల జాబితాను విడుదల చేశారు. వీటిని తక్షణం దుకాణాల నుంచి తొలగించాలని ఆదేశిస్తూ జిల్లాలోని హోల్‌సేల్, రిటైల్ మందుల దుకాణాదారులకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ మందుల కాంబినేషన్‌లో హేతుబద్ధత లేదని, పైగా రోగుల చికిత్సల్లో ఈ మందుల వినియోగం వల్ల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని డీటీఏబీ నిపుణులు పేర్కొన్నారు. బాగా ప్రాచుర్యంలో ఉన్న పలు ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు నిషేధిత మందుల జాబితాలో ఉండటం విశేషం. మెఫనమిక్ యాసిడ్, పారా సిటమాల్ కాంబినేషన్ ఇంజెక్షన్లను సాధారణంగా నొప్పి నివారణకు వినియోగిస్తారు. ఈ కాంబినేషన్ మందు వల్ల రోగుల్లో తీవ్రమైన దుష్ఫలితాలు తలెత్తుతున్నట్లు నిపుణులు గుర్తించారు. అదే విధంగా ఎసిక్లోఫెనాక్, పారాసిటమాల్ కాంబినేషన్ చాలా సాధారణంగా వైద్యులు ప్రిస్క్రైబ్ చేస్తుంటారు. ఈ కాంబినేషన్‌పైనా ప్రభుత్వం నిషేధం విధించింది. మొటిమల చికిత్స, ముక్కు దిబ్బడ, చర్మవ్యాధుల చికిత్సల్లో వాడే ఔషధాలు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయి. గతంలో 2018లో కేంద్ర ప్రభుత్వం 328 ఎఫ్‌డీసీ మందులపై నిషేధం విధించింది. ఆరేళ్ల తర్వాత మరోసారి పెద్ద సంఖ్యలో మందులపై నిషేధం విధిస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేయడం విశేషం.

1 నుంచి బీజేపీ సభ్యత్వం: పురందేశ్వరి



సర్పవరం జంక్షన్ (కాకినాడ), ఆగస్టు 25: 'పదకొండవ ఆర్థిక శక్తిగా ఉన్నటువంటి భారతదేశాన్ని ప్రధాని మోదీ పాలనలో ఐదో ఆర్థిక శక్తిగా అవతరించి ప్రపంచ పటంలో ఆవిష్కరించింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మూడో ఆర్థికశక్తిగా చూడాలనే దిశగా బీజేపీ కూటమి ప్రయత్నిస్తోంది' అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. ఆమె కాకినాడలో పార్టీ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించే పార్టీ సభ్యత్వ నమోదుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 37 లక్షల మంది సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆమె తెలిపారు. కాగా, త్వరలో జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి తమ మేనిఫెస్టోలో ఆర్టికల్ 370, 35ఏలను పునరుద్ధరిస్తామని ప్రకటించడాన్ని బట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసే రీతిలో వ్యవహరిస్తారని మండిపడ్డారు. దీనిపై రాహుల్ గాంధీ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ: భువనేశ్వరి



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా పేద అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కుప్పంలో ఈ శిక్షణ ఉంటుందని, అర్హులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు.

బడితో చెడుగుడు!

నాడు-నేడుపై జగన్ సర్కారు చెప్పినవన్నీ అబద్ధాలే

- ప్రచారం కోసం పథకాన్ని వాడుకున్న వైసీపీ పెద్దలు
- చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే నిలిపేసిన వైనం
- మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టని నేతలు
- జగన్ ప్రభుత్వంలో మూడు వేల కోట్లు పక్కదారి
- ఇప్పుడు వాటినేం చేయాలంటూ అధికారుల కసరత్తు
- పథకం పేరు 'మన బడి-మన భవిష్యత్తు'గా మార్పు
- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నాడు-నేడు' పథకంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేస్తామని గత జగన్ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. అయితే ఇందులో ప్రచారం తప్ప పనులేం చేయలేదని తేలింది. చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే వదిలేసినట్లు వెల్లడైంది. ప్రభుత్వ బడుల్లో అద్భుతాలు అంటూ రాజకీయ లబ్ధి కోసం విశ్వప్రయత్నాలు చేసిన వైసీపీ పెద్దలు... వాటిలో మౌలిక సదుపాయాల పురోగతిపై దృష్టి పెట్టలేదు. దీంతో నాడు-నేడు మధ్యలోనే ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంచనా వేయగా నాడు-నేడు రెండో దశలో కేవలం 7.88శాతం పనులే పూర్తిచేసిన విషయం బయటపడింది. 22,311 బడుల్లో రెండోదశ పథకం ప్రారంభించగా కేవలం 1,759 బడుల్లో మాత్రం పనులు పూర్తయ్యాయి. 20,552 పాఠశాలల్లో మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పుడు వాటినెలా పూర్తిచేయాలన్న దానిపై ప్రభుత్వం దృష్టి సారించింది. తొలుత కాంట్రాక్టు విధానంలో పనులు చేయించాలని యోచించినా, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలని నిర్ణయానికొచ్చింది. కొత్తగా ఎన్నుకున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు పూర్తి చేయాలని భావిస్తోంది. పనులు ఏ దశల్లో ఉన్నాయి? ఇంకా ఏ మేరకు నిధులు అవసరం? అనేదానిపై పాఠశాల విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. కాగా 'నాడు-నేడు' పథకం పేరును 'మన బడి-మన భవిష్యత్తు'గా ప్రభుత్వం మార్చింది.

పనుల ప్రారంభంపైనా ఆరా

పనులు మధ్యలో వదిలేయడం ఒకెత్తు అయితే అసలు ఏ ప్రాతిపదికన బడుల్లో పనులు మొదలుపెట్టారనే అంశంపై కూడా పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. నాడు- నేడు పథకం ప్రారంభం నాటి అధికారులతో ఇటీవల సమావేశం నిర్వహించారు. ఆ బాధ్యతల నుంచి తప్పుకొని వెళ్లిపోయిన వారిని కూడా పిలిపించారు. మొదటి, రెండో దశల్లో పనులు ప్రారంభానికి బడులను ఏ ప్రాతిపదికపై ఎంపిక చేశారో తెలుసుకుంటున్నారు. నాడు-నేడు పేరుతో భారీగా నిధులు ఖర్చు చేశాక కొన్ని ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. తరగతుల విలీనం ప్రక్రియ చేపట్టడంతో కొన్ని బడుల్లో విద్యార్థుల సంఖ్య జీరోకు చేరింది. దీంతో అక్కడి టీచర్లను ఇతర పాఠశాలలకు పంపి, ఆ బడులకు తాళాలు వేశారు. అయితే విద్యార్థుల సంఖ్య అంతంతమాత్రంగా ఉన్న బడులను ఎందుకు ఎంపిక చేయాల్సి వచ్చిందో ఇప్పుడు వివరాలు సేకరిస్తున్నారు.

ఎక్కడి పనులు అక్కడే

ప్రాథమిక పాఠశాలలపై దృష్టి

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మెరుగ్గానే ఉన్నా ప్రాథమిక పాఠశాలల పరిస్థితి ఏటా దిగజారుతోంది. విద్యార్థులు లేక ఆ బడులు వెలవెలబోతున్నాయి. 20 మంది విద్యార్థులు కూడా లేని బడులు దాదాపు దాదాపు 12వేల వరకూ ఉన్నాయి. వీటిలో కేవలం ఒక్కరే టీచరు ఉన్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆ బడుల్లోనూ ఒక్కో తరగతికి ఒక టీచర్‌ను నియమించే ఆలోచన చేస్తోంది. దాంతోపాటు అన్ని బడుల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని, వచ్చే ఏడాది నాటికి టీచర్లను పెంచి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నించాలని ప్రణాళికలు రూపొందిస్తోంది.



> **45**వేల ప్రభుత్వ బడుల్లో మొత్తం మూడు దశల్లో మౌలిక సదుపాయాల కల్పన పూర్తిచేస్తామని జగన్ ప్రభుత్వం ప్రకటించింది. మొదటి దశలో 15,715 బడుల్లో పథకం ప్రారంభించగా, దాదాపుగా పూర్తయ్యాయి. రెండోదశ పనులు 2022లో ప్రారంభించారు. 22,311 బడుల్లో వసతులు అభివృద్ధి చేయడంతో పాటు అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. రూ.8వేల కోట్ల అంచనాతో ప్రారంభించిన ఈ పనులకు ఇప్పటి వరకూ రూ.4,107 కోట్లు ఖర్చు చేశారు. అయితే రూ.7వేల కోట్లకు పైగా నిధులను వివిధ రూపాల్లో సమీకరించినా వాటిని పథకానికి వినియోగించకుండా పక్కదారి పట్టించారు. నిధుల లేమితో వేల సంఖ్యలో బడుల్లో పనులు మధ్యలో నిలిచిపోయి ప్రాంగణాలన్నీ అస్తవ్యస్తంగా మారాయి. దీనిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, కడప, విజయనగరం, మన్యం మినహా ఏ జిల్లాలోనూ పది శాతం పనులు కూడా పూర్తికాలేదు.